సాక్షి 24|7
మంచిర్యాల
గురువారం 4-1-2018



స్వచ్ఛ పరీక్ష






- స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో బల్దియాలు
- నేటినుంచి కేంద్ర బృందం తనిఖీలు
- వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి
- వందశాతంతో లక్ష్యాలకు చేరుకున్న వైనం

మందమర్రి(చెన్నూర్): దేశంలోని ఆయా మున్సిపాలిటీల్లో స్వచ్ఛత, పౌరసేవలు, అధికారుల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల ఆధారంగా స్వచ్ఛ సర్వేక్షణ్ పథకానికి ఎంపిక చేసేందుకు కేంద్ర ప్రభుత్వం

- మిగతా 2లో▶

మూడు మున్సిపాలిటీల్లో మరుగుదొడ్ల కోసం అందిన దరఖాస్తులు, మంజూరైనవి, ప్రగతి వివరాలు..



	దరఖాస్తులు	మంజూరు	ప్రగతి
మంచిర్యాల	3,666	3,352	100
మందమర్రి	2,527	1,912	100
బెల్లంపల్లి	2,187	1,527	100
మొత్తం	8,380	6,791	100

సాఫ్ట్‌వేర్ టు సివిల్స్

ఐఏఎస్ పీఎస్ రాహుల్‌రాజ్ ప్రస్థానం

బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా నియామకం

నేడు బాధ్యతలు స్వీకరించే అవకాశం

బెల్లంపల్లి: ఇంజినీరింగ్ చదివారు. ప్రతిష్టాత్మకమైన టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం పొందారు. ఐదంకెల జీతం వస్తున్నా.. అక్కడ ఆనందం లేదు. ప్రజలకు దగ్గరగా ఉంటూ.. వారి సాధకబాధకాల్లో పాలుపంచుకుంటూ.. నిత్యం జనంతోనే మమేకం కావాలనుకున్నారు. మూడున్నరేళ్లకే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదులుకున్నారు. తన ఆశయమైన సివిల్ సర్వీసెస్‌ను ఎంచుకున్నారు. మొదటిసారి విఫలమైనా

- మిగతా 2లో▶



గెలిచిన పది మంది అభ్యర్థులు

హోరాహోరీగా రెడ్‌క్రాస్ ఎన్నికలు

మంచిర్యాలటౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల కమిటీ ఎన్నికలు బుధవారం పట్టణంలోని ఎఫ్‌సీఐ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. మొదటిసారి జరిగిన ప్రత్యక్ష ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పడిన తొమ్మిదేళ్లలో ప్రతీసారి ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. ఈసారి పోటీ ఎక్కువ కావడంతో ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించారు. పదిమంది కమిటీ సభ్యులకు గాను

- మిగతా 2లో▶



అంధులకు వెలుగు

నేడు బ్రెయిలీ డే

-8,9లో..

మినీ FOCUS

ఉపాధి 'కల్పన'

7లో

సాఫ్ట్‌వేర్ టు సివిల్స్

▶మొదటిపేజీ తరువాయి

పట్టువిడవలేదు. రెండో ప్రయత్నంలో ఐఏఎస్ సాధించి తన కలను సాకారం చేసుకున్నారు. ఆయనే బెల్లంపల్లికి మొదటి సబ్ కలెక్టర్‌గా నియామకమైన పాముల సాయి రాహుల్‌రాజ్. హైదరాబాద్‌కు చెందిన పీఎస్ రాహుల్ రాజ్ విద్యాభ్యాసమంతా నగరంలోనే సాగింది. 2009లో జేఎన్‌టీయూ(హెచ్) నుంచి ఇంజనీరింగ్ పట్టభద్రుడయ్యారు. ఆ వెంటనే టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీఎసీఎస్)లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేశారు. ఆ కంపెనీలో మూడున్నర సంవత్సరాల పాటు పనిచేసిన రాహుల్‌రాజ్‌కు ఇంకా ఏదో సాధించాలనే తపన ఉండేది. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌గా ఉన్నత ఉద్యోగం సాధించినా మానసిక సంతృప్తి లేకపోవడంతో ప్రజలకు ప్రత్యక్షంగా సేవచేసే అవకాశాలున్న సివిల్ సర్వీసెస్ లక్ష్యంగా పెట్టుకున్నారు. 2013లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రాజీనామా చేసి సివిల్స్‌పై దృష్టి పెట్టారు. అంతకు ముందే ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) నుంచి పబ్లిక్ మేనేజ్‌మెంట్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) పూర్తి చేశారు. తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ఎంతో పట్టుదలతో శ్రమించారు. 2014లో సివిల్ సర్వీసెస్ పరీక్షకు హాజరై మొదటి దఫా ఇంటర్వ్యూ వరకు వెళ్లి అడుగుదూరంలో ఆగిపోయారు. దాంతో ఏమాత్రం నిరాశ చెందకుండా మరింత పట్టుదలతో రెండోసారి ప్రయత్నించారు. ఈసారి ఆలిండియా స్థాయిలో 375 ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు సాధించి తన లక్ష్యమైన ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. అనంతరం 2016 జూన్‌లో నిజామాబాద్ జిల్లా బోధన్‌లో అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్నారు. తాజాగా ప్రభుత్వం ఆయనను బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా నియమించింది. రాహుల్‌రాజ్ గురువారం ఇక్కడ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే జిల్లా కలెక్టర్‌గా యువ ఐఏఎస్ అధికారి ఆర్‌వీ.కర్ణన్ తన పనితీరుతో అందరిని ఆకట్టుకుంటుండగా.. మరో యువ ఐఏఎస్ అధికారి జిల్లాకు వస్తుండటంతో అందరి దృష్టి ఆయనపైనే ఉంది.

బయోడేటా

పేరు	*పాముల సాయి రాహుల్ రాజ్*
తల్లిదండ్రులు	*జ్యోతిక, సాయి ప్రసాదరావు*
భార్య	*శ్రీజా రాహుల్*
స్వస్థలం	*హైదరాబాద్*
పుట్టిన తేది	*27 నవంబర్ 1987*
ఇంజనీరింగ్	*జేఎన్‌టీయూ (హైదరాబాద్)*
ఉద్యోగం	*2009 నుంచి 2013 వరకు టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్*
సివిల్స్‌కు ఎంపిక	*2015లో (రెండో ప్రయత్నంలో)*
సాధించిన ర్యాంకు	*జాతీయ స్థాయిలో 375, రాష్ట్ర స్థాయిలో 14వ ర్యాంకు*
ఆప్షనల్ సబ్జెక్టు	*పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్*

భూపాలపల్లి బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ కర్ణన్

మంచిర్యాలసిటీ: మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు రాష్ట్ర ప్రభుత్వం భూపాలపల్లి జిల్లా కలెక్టర్ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మంచిర్యాలలోని తన కార్యాలయంలోనే కర్ణన్ భూపాలపల్లి జిల్లా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికే పెద్దపల్లి జిల్లాకు రెండు రోజులపాటు ఇన్‌చార్జి కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. మంగళవారం పెద్దపల్లి జిల్లాకు పూర్తి స్థాయి కలెక్టర్‌ను ప్రభుత్వం నియమించింది. కలెక్టర్ కర్ణన్ మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా పదోన్నతి పొందకముందు నుంచే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పూర్తి స్థాయిలో బాధ్యతలు నిర్వహిస్తుండడం విశేషం.

స్వచ్ఛ పరీక్ష

▶మొదటిపేజీ తరువాయి

నిర్ణయించింది. ఈ పథకంలో చోటు దక్కించుకున్న మున్సిపాలిటీలకు ప్రత్యేకంగా నిధులు విడుదల కానున్నాయి. ఈసారి స్వచ్ఛ సర్వేక్షణ్ జాబితాలో దేశవ్యాప్తంగా 4వేలకు పైగా మున్సిపాలిటీలు ఉండగా, మన జిల్లాలోని మూడు బల్దియాలు సైతం పోటీ పడుతున్నాయి.

నేటినుంచి కేంద్ర బృందం పరిశీలన..

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం వందశాతం పురోగతి సాధించింది. బల్దియాల్లో అధికారులు సల్పిన కృషి, కార్యాచరణ, లబ్ధిదారుల మనోగతాన్ని స్వయంగా తెలుసుకునేందుకు కేంద్ర సర్వే బృందం నేటినుంచి అన్ని మున్సిపాలిటీల్లో తనిఖీలకు శ్రీకారం చుట్టనుంది. అధికారుల పనితీరు, స్థానికుల అభిప్రాయాలు, స్వీయ పరిశీలన.. ఈ మూడు అంశాల ఆధారంగా మున్సిపాలిటీల స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని సర్వే బృందం కేటాయించే మార్కుల ఆధారంగా ఉత్తమ మున్సిపాలిటీలను కేంద్రం ప్రకటించనుంది. ఇందులో ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పారిశుధ్యం నిర్వహణ, బహిరంగ రహిత మలమూత్ర విసర్జనకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

ఎట్టకేలకు పోటీకి సిద్ధం..

విభాగాల వారిగా మార్కులు కేటాయింపు ఇలా...

విభాగం	మార్కులు	శాతం
అధికారుల పనితీరు	1,400	35
సర్వే బృందం స్వయం పరిశీలన	1,200	30
స్థానికుల సమాచారం	1,400	35
మొత్తం	4,000	100

మహిళల మనోభావాలకు, వారి ఆత్మగౌరవానికి భంగం కలగకూడదన్న సంకల్పంతో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టగా.. ఎట్టకేలకు మూడు పట్టణాల్లో పూర్తయ్యాయి. మిగతా అంశాల్లోనూ ముందుండే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే మొదటి దఫా మున్సిపాలిటీల్లో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందాలు పర్యటించాయి. ఈ బృందాలు వంద శాతం మరుగుదొడ్లు నిర్మించిన మున్సిపాలిటీలకు ప్రశంసాపత్రాలు అందించాయి. ఇక నేటినుంచి జరగనున్న తనిఖీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ తనిఖీల్లో ఎంపికయ్యేందుకు అపసోపాలు పడ్డారు. కాలనీలు, వార్డుల వారీగా పారిశుధ్య నిర్వహణ, మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులకు సైతం అవగాహన కల్పించి తల్లిదండ్రుల్ని వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ఆసక్తి చూపేలా ప్రయత్నించారు. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించిన అధికారులు తుది పోటీలో నిలుస్తున్నారు. ఏ బల్దియా ఈ పురస్కారాన్ని దక్కించుకుంటుందో చూడాలి.

బల్దియాల్లో ప్రగతి ఇలా..

మందమర్రి మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో బల్దియా పరిధిలోకి వచ్చేవి 16 వార్డులు మాత్రమే. మిగిలిన ఎనిమిది వార్డులు సింగరేణి ఆధీనంలో ఉన్నాయి. 16 వార్డుల్లో 12,860 పైచిలుకు ఇళ్లలో 52,380 మంది ప్రజలు నివసిస్తున్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల కోసం 2,527 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 1912 మందిని మున్సిపల్ అధికారులు అర్హులుగా గుర్తించి మరుగుదొడ్లు మంజూరు చేశారు. 2017 ఆగస్టు నాటికే 95 శాతానికి పైగా లబ్ధిదారులు మరుగుదొడ్లు నిర్మించుకోవడం విశేషం. పెండింగ్‌లో ఉన్న 300లకు పైగా మరుగుదొడ్ల నిర్మాణంలో కొంత జాప్యం చోటు చేసుకుంది. దీంతో జీవధార, యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ స్వచ్ఛంద సంస్థలతో పాటు కాంట్రాక్టర్లను ఒప్పించి లక్ష్యాన్ని చేరుకునేలా చర్యలు తీసుకున్నారు. దీంతో బల్దియా పరిధిలో ఎట్టకేలకు వందశాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి అయ్యింది.

మంచిర్యాల, బెల్లంపల్లిలలో...

మరుగుదొడ్ల నిర్మాణంలో మంచిర్యాల, బెల్లంపల్లి మున్సిపాలిటీలు వందశాతం ప్రగతి సాధించాయి. మంచిర్యాలలో 3,666 దరఖాస్తులు రాగా, 3,352 మంది లబ్ధిదారులను అధికారులు గుర్తించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో 2,187 దరఖాస్తులు రాగా 1,527 మందిని అర్హులుగా గుర్తించి వారికి మరుగుదొడ్లు మంజూరు చేశారు. కేంద్ర బృందాలు ఇప్పటికే సర్వే జరిపించి వందశాతం ప్రగతి సాధించినట్లు నివేదికలు పంపించాయి.

హోరాహోరీగా రెడ్‌క్రాస్ ఎన్నికలు

▶మొదటిపేజీ తరువాయి

21 మంది పోటీపడ్డారు. 2,850 ఓట్లకుగాను ఐదు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయగా, 1,026 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అభ్యర్థులు పోలింగ్ కేంద్రం గేటు వద్ద ఉండి ప్రతి ఒక్కరినీ తమకే ఓటు వేయాలని కోరుతూ వారికి కేటాయించిన గుర్తులకు సంబంధించిన వస్తువులను ప్రదర్శించారు. ఎన్నికల అధికారిగా జిల్లా సహకార సంఘం అధికారి బి.సంజీవరెడ్డి, అసిస్టెంట్ ఎన్నికల అధికారులుగా తారామణి, రవికిషోర్ వ్యవహరించారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు సాయంత్రం 4కు



ఎన్నికల కౌంటింగ్

మొదలై రాత్రి 9 గంటల వరకు జరిగింది. సభ్యులుగా గెలిచిన పది మంది కలిసి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవాల్సి ఉండగా, అభ్యర్థుల మధ్య సయోధ్య కుదరకపోవడంతో ఈ ఎన్నికలను వాయిదా వేయాలని ఎన్నికల అధికారి సంజీవ్‌రెడ్డిని కోరారు. దీంతో రెండు రోజుల్లోగా కమిటీని ఎన్నుకోవాలని, ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నిక సాధ్యం కాకపోతే, సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నిక ఉంటుందని స్పష్టం చేశారు. సభ్యుల కోరిక మేరకు వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు.

గెలిచిన అభ్యర్థులు వీరే...

చందూరి మహేందర్(634 ఓట్లు), కంకణాల భాస్కర్‌రెడ్డి (392), పడాల రవీందర్ (369), కాసర్ల శ్రీనివాస్ (364), వి.మధుసూదన్‌రెడ్డి (355), వ్యాసభట్ రాధాకృష్ణ (351), డాక్టర్ పీవీవీ.సత్యనారాయణమూర్తి (325), కె.సత్యపాల్ (305), యెడ్ల కిషన్ (290), ఎస్.నాగేందర్‌రావు (279 ఓట్లు).

ముమ్మరంగా వరినాట్లు



నాట్లు వేస్తున్న మహిళలు



నారు తీస్తున్న మహిళలు

జన్నారం(ఖానాపూర్): జన్నారం మండలంలో యాసంగి వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అన్ని గ్రామాల్లో ఒకే సమయంలో వరినాట్లు మొదలు కావడంతో కూలీల కొరత ఏర్పడుతోంది. మహిళలు ఉదయమే ఇంటి పనులు పూర్తి చేసుకుని వడివడిగా వరినాట్లకు బయల్దేరుతున్నారు. అలసట కలగకుండా మహిళలు పాటలు పాడుతూ నాట్లు వేస్తున్నారు. బుధవారం మండలంలోని కలమడుగులో ఒకే పొలంలో 40 మంది మహిళలు పల్లె పాటలు పాడుతూ నాట్లు వేయడం కనిపించింది.

ఎదిగిన కొడుకు మంచానికే పరిమితమై..!

వారిదో నిరుపేద కుంటుంబం.. ఇంట్లోని ఇద్దరూ కూలీ పని చేస్తూ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. ఊహించని విధంగా చిన్నవయస్సులోనే కన్న కొడుకు రెండు కిడ్నీలు చెడిపోయాయని తెలిసిన ఆ తల్లిదండ్రులు గుండెపగిలేలా విలపిస్తున్నారు. రెండు కిడ్నీలు పాడవడంతో మంచానికే పరిమతమయ్యాడా యువకుడు. దాతలు ఆపన్న హస్తం అందించాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

పాడైపోయిన యువకుడి రెండు కిడ్నీలు

ఆపరేషన్‌కు రూ.8లక్షలపైనే..

ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు



కిడ్నీలు పాడైపోయిన రఘుచందర్‌తో తల్లిదండ్రులు

జైపూర్(చెన్నూర్): కోటపల్లి మండలం శంకరాపూర్ గ్రామానికి చెందిన ఆసంపల్లి రాజక్క–రాజయ్య దంపతులకు ఇద్దరు సంతానం. కొడుకు రఘుచందర్, కూతురు సింధూజ. ఉపాధి నిమిత్తం రాజక్క, రాజయ్య దంపతులు జైపూర్‌కు వలస వచ్చారు. ఇక్కడే భార్యభర్తలు ఇద్దరూ కూలీ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రఘుచందర్ ఇంటర్ పూర్తి చేయగా సింధూజ పదో తరగతి చదువుతోంది. గత ఏడాది జూన్‌లో రఘుచందర్ ఆనారోగ్యానికి గురికాగా తల్లిదండ్రులు వైద్యం కోసం ఆస్పత్రికి తీసుకెళ్లారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్నట్లు వైద్యులు తెలిపారు. మూడు నెలల నుంచి వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో కరీంగనర్, హైదరాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు వైద్యులు. రఘుచందర్ రెండు కిడ్నీలు పని పాడైపోయాయని వైద్యులు తెలుపడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. చేతికందిన కొడుకు కళ్ల ఎదుటే మంచానికి పరిమితమై ఉండడంతో కొడుకును ఎలాగైనా కాపాడుకోవాలని ఆ తల్లిదండ్రులు రూ.1లక్ష 50 వేలు అప్పు చేసి వైద్యం అందించారు. రెండు కిడ్నీలు పాడైపోవడం, మూత్రవ్యవస్థ పనిచేయక పోవడంతో రఘుచందర్ శరీరం మొత్తం వాపు వచ్చింది. ప్రతి పదిహేనురోజులకోసారి డయాలసిస్ చేసి శరీరంలోని రక్తాన్ని శుద్ధి చేసి మళ్లీ రక్తాన్ని ఎక్కిస్తున్నారు. కిడ్నీలు మార్చడానికి సుమారు రూ.8 లక్షలకుపైనే ఆపరేషన్‌కు ఖర్చు అవుతుందని అది కూడా ఎవరైనా కిడ్నీలు దానం చేస్తే ఆపరేషన్ చేస్తామని వైద్యులు తెలిపారు. చేతిలో డబ్బుల్లేక ఆపరేషన్ చేయించలేకపోతున్నామని దాతలు సహాయం అందించాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. సహాయం అందించేందుకు 9963139051, 9704606452 నెంబర్లలో సంప్రదించగలరు.

దీనగాథకు చలించిన హృదయాలు

- సాక్షి కథనానికి స్పందించిన కలెక్టర్ డి.దివ్య
- అనాథ పిల్లలను అక్కున చేర్చుకున్న ఐసీపీఎస్, ఐసీడీఎస్

బజార్‌హత్నూర్(బోథ్): గత నెల 31న 'సాక్షి' జిల్లా పేజీలో ప్రచురితమైన 'లేత హృదయాలు.. మాననిగాయాలు' కథనానికి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ డి.దివ్య స్పందించారు. సమగ్ర పిల్లల సంరక్షణ సేవ సంస్థ జిల్లా అధికారి రాజేద్రప్రసాద్, ఐసీడీఎస్ అధికారులను వెంటనే భూతాయితాండ గ్రామానికి వెళ్లాలని కలెక్టర్ ఆదేశించడంతో బుధవారం అధికారులు భూతాయి తాండ గ్రామానికి చేరుకున్నారు. వాగ్మరే ప్రియాంక, దళితేకుమార్, వైభవ్‌ను ఆదిలాబాద్‌లోని బాల సదన్‌కు తీసుకెళ్లారు. ముందుగా అధికారులు గ్రామస్తులతో, అనాథపిల్లలతో మాట్లాడారు. వారి అభిప్రాయం తెలుసుకుని జిల్లా కేంద్రంలోని చైల్డ్ హోం(బాలసదనం)లో ఉండడానికి ఒప్పుకోవడంతో ఐసీపీఎస్ జిల్లా అధికారి రాజేంద్రప్రసాద్ తమ కారులో ముగ్గురు పిల్లలను ఆదిలాబాద్ చైల్డ్ హోంకు తీసుకవెళ్లారు. అనాథ పిల్లల దీనగాథను ప్రచురించిన 'సాక్షి'ని పలువురు అభినందించారు. ఇందులో బోథ్ సీఐ జయరాం, సర్పంచ్ వాగ్మరే రాజు, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చౌహాన్ శీతల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయ, ఐసీపీఎస్ సోషల్‌వర్కర్ వీణ, ఉపాధ్యాయులు రమేశ్, పరమేశ్వర్, అంగన్‌వాడీ కార్యకర్త సింధు పాల్గొన్నారు.



అనాథ పిల్లలతో ఐసీపీఎస్ అధికారి రాజేంద్రప్రసాద్

గుట్కా తరలిస్తుండగా పట్టివేత

- ముగ్గురిపై కేసు నమోదు
- రూ.లక్ష విలువైన గుట్కా ప్యాకెట్లు స్వాధీనం



నస్పూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట జాతీయ రహదారిపై మోటార్ సైకిళ్లపై తరలిస్తున్న రూ.లక్ష విలువైన గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నట్లు జైపూర్ ఏసీపీ సీతా రాములు తెలిపారు. బుధవారం సాయంత్రం శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట వాహనాలు తనిఖీ చేస్తుండగా మంచిర్యాల వైపు నుంచి శ్రీరాంపూర్‌కు రెండు మోటార్ సైకిళ్లపై సంచులు తీసుకువస్తున్న వారిని తనిఖీ చేయగా వారి వద్ద అంబార్, గుట్కా ప్యాకెట్లు లభించాయి. వీటిని సరఫరా చేస్తున్న మంచిర్యాల గౌతమినగర్‌కు చెందిన వినిశెట్టి వెంకటేశ్, రాళ్లపేటకు చెందిన షేక్ అహ్మద్, ఎంఎ.జావిద్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రూ.లక్ష విలువైన గుట్కా ప్యాకెట్లతో పాటు రెండు మోటార్ సెకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపా రు. నిషేధిత అంబార్, గుట్కా ప్యాకె ట్లు తరలించినా, అమ్మిన వారిపై చట్ట పరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గుట్కా తరలిస్తున్న వారిని పట్టుకున్న ఎస్సై రవిప్రసాద్‌ను, స్టేషన్ సిబ్బందిని ఏసీపీ సీతారాములు, సీఐ నారాయణ నాయక్ అభినందించారు.

వేటగాడి అరెస్ట్



వేటగాడి అరెస్టు చూపుతున్న అటవీ సిబ్బంది

నెన్నెల(బెల్లంపల్లి): నెన్నెల మండలం బొప్పారం శివారు అటవీప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చి వన్యప్రాణులను వేటాడుతున్న బెల్లంపల్లి మండలం దుగినేపల్లికి చెందిన చల్లూరి నానయ్యను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కుశ్నపల్లి రేంజర్ అప్పలకొండ తెలిపారు. నానయ్యతో పాటు దుగుట రవి, కుమ్మరి కల్యాణ్ విద్యుత్ తీగలు అమర్చి వన్యప్రాణుల వేట కొనసాగిస్తున్నారని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు దాడులు నిర్వహించి నానయ్యను పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న బైండింగ్ వైర్ బెండల్‌ను స్వాధీనం చేసుకున్నారు. గమనించిన రవి, కల్యాణ్ పరారయ్యారు. త్వరలోనే వారిద్దరిని పట్టుకొని రిమాండ్‌కు తరలిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. దాడుల్లో డెప్యూటీ రేంజర్ రమాదేవి, బీట్ ఆఫీసర్ రమేశ్, స్ట్రైక్ ఫోర్స్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- భర్త, కూతురుకు తీవ్రగాయాలు
- ఆటోపైకి దూసుకువచ్చిన బైక్



అనిత మృతదేహంపై కూతురు సరిత, పక్కన భర్త

కాసిపేట(బెల్లంపల్లి): కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాష్ట్రీయ రహదారిపై సుబ్బారావుపల్లి స్టేజీ వద్ద ఆటోను మోటర్‌సైకిల్ ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న గోమాస అనిత(28) మృతి చెందింది. భర్త దేవాజీతో పాటు కూతురు సరితకు తీవ్రగాయాలయ్యాయి. కన్నెపల్లి మండల కేంద్రానికి చెందిన గోమాస దేవాజీ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తొమ్మిదేళ్లక్రితం గద్వాల్ జిల్లా బూత్కూర్ గ్రామానికి చెందిన అనితను ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. బుధవారం దేవాజీ భార్యను మూడేళ్ల కూతురు సరితతో కలిసి మంచిర్యాలలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. తిరుగు ప్రయాణంలో దేవాజీ ఆటో నడుపుతుండగా అనిత కూతురుతో పాటు వెనక కూర్చోంది. రహదారిపై సబ్బారావుపల్లి సమీపంలోకి చేరగానే వెనకల నుంచి అతివేగంతో వస్తున్న మోటర్‌సైకిల్ ఆటోను ఢీకొట్టి ఆటోలోకి చొచ్చుకువెళ్లింది. దీంతో పైకి బైక్ దూసుకుపోవడంతో అనిత కిందపడి తలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందింది. ఆమెపై పడిన కూతురు సరిత, దేవాజీకి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. బైక్‌పై ఉన్న రియాజ్‌కు సైతం గాయాలయ్యాయి. ఒకపక్క భార్య మృతిచెందిగా కూతురుకు తీవ్రగాయాలు కావడం, సంఘటన స్థలం నుంచి భర్త రోదిస్తు బంధువులకు సమాచారం ఇవ్వడం అందరిని కలిచి వేసింది. కాగా వీరికి ముగ్గురు కూతుళ్లు కాగా అందరు చిన్నపిల్లలు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ పేర్కొన్నారు. మతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

తలమడుగు(బోథ్): భీంపూర్ మండలం నిపాని గ్రామానికి చెందిన చిన్న పొచ్చన్న(35) కుటుంబ కలహాలతో బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్న పొచ్చన్న భార్య లలితతో ఇంట్లో గొడవ పడ్డాడు. గతేడాది కూతురి వివాహానికి అప్పు చేయగా, అప్పుల విషయమై ఇంట్లో భార్య, భర్తలకు మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మనస్థాపం చెంది మంగళవారం రాత్రి పురుగుల మందు సేవించాడు. కుటుంబీకులు గమనించి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లేశ్ తెలిపారు.

మత్తులో లారీ నడిపిన డ్రైవర్‌కు ఐదు రోజుల జైలు

కాగజ్‌నగర్(సిర్పూర్): ఫుల్లుగా మద్యం తాగి లారీ నడిపిన డ్రైవర్‌కు ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ బుధవారం సిర్పూర్ (టి) కోర్టు న్యాయమూర్తి రామరావు తీర్పు వెలువరించినట్లు పట్టణ సీఐ ఆరె వెంటేశ్వర్ తెలిపారు. డిసెంబర్ 17న పట్టణంలోని లారీ చౌరస్తాలో పట్టణ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, భీమిని మండలం కేస్లాపూర్ గ్రామానికి చెందిన అంబిలపు రాజేశ్(45) ఎక్కువ మోతాదులో మద్యం సేవించి లారీ నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు రాజేశ్‌కు ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ బుధవారం కోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.

మహిళను వేధించిన కేసులో రూ.5వేలు జరిమానా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మహిళను అవమానపర్చిన కేసులో హాజీపూర్ మండలం పడ్తనపల్లి గ్రామానికి చెందిన వైద్య తిరుపతికి ఐదు వేలు జరిమానా విధిస్తూ లక్సెట్టిపేట ఫాస్ట్ ట్రాక్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి మహ్మద్ నిజాముద్దీన్ బుధవారం తీర్పునిచ్చారు. 2013 డిసెంబర్ 3న పడ్తనపల్లి గ్రామానికి చెందిన అంకం అమ్మాయి అనే మహిళను దూషించడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు బాధితురాలు, ఆమె కుటుంబీకుల ఫిర్యాదు మేరకు హాజీపూర్‌లో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు పంపారు. కోర్టులో పీపీ కిరణ్‌కుమార్ సాక్షులను ప్రవేశపెట్టగా రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి రూ. 5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. రూ.5వేల జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలల జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

వాతావరణం

రానున్న 24 గంటల్లో అండమాన్, నికోబార్ దీవుల్లో మోస్తరుగా వర్షం పడుతుంది. జమ్మూ, కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో తేలికపాటి వాన లేదా మంచు కురిసే అవకాశం ఉంది. కేరళలోని కోస్తా ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షం కురుస్తుంది. ఉత్తరప్రదేశ్, హరియాణా, పంజాబ్, బిహార్, అసోం, పశ్చిమబెంగాల్‌లలో మోస్తరు నుంచి దట్టమైన పొగమంచు కప్పి ఉంటుంది. ఉత్తర ప్రదేశ్, బిహార్‌లలో రోజంతా చల్లని వాతావరణం ఉంటుంది.

గుంటూరు వాతావరణం / ఆదిలాబాద్ వాతావరణం

గరిష్టం కనిష్టం

31.8/16.0 / 29.4/07.0

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	18.4	07.4
కోల్‌కతా	23.8	13.7
బెంగళూరు	27.6	18.4
ముంబై	30.0	16.4
చెన్నై	30.2	22.6

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
కర్నూలు	32.3/19.7	రాజమండ్రి	30.3/19.4
అనంతపురం	32.0/17.1	తాడేపల్లిగూడెం	30.3/19.4
ఒంగోలు	31.9/22.2	వరంగల్	30.3/18.0
గుంటూరు	31.8/16.0	కాకినాడ	29.8/20.0
కడప	31.7/18.5	కరీంనగర్	29.8/12.5
నెల్లూరు	31.3/22.8	విజయవాడ	29.7/19.0
చిత్తూరు	31.2/19.3	విశాఖపట్నం	29.4/21.5
తిరుపతి	31.2/19.3	ఆదిలాబాద్	29.4/07.0
మహబూబ్‌నగర్	31.1/18.9	హైదరాబాద్	29.2/16.9
ఖమ్మం	31.0/14.2	రంగారెడ్డి	29.2/16.9
మెదక్	30.7/12.0	నల్లగొండ	29.2/15.0
నిజామాబాద్	30.4/14.9	శ్రీకాకుళం	28.0/16.0
ఏలూరు	30.3/19.4	విజయనగరం	28.0/16.0

బుల్లితెర

www.sakshi.com

SAKSHI TV


ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 గుడ్ మార్నింగ్
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.08.30 న్యూస్ ఫీచర్
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.00 మనసులో మాట
ఉ.11.30 పొలిటికల్ కారిడార్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
రా.10.30 స్క్రీన్‌ప్లే
రా.11.30 న్యూస్ ఫీచర్

టీవీలో ఈరోజు సినిమాలు



జెమిని మూవీస్
ఉ.07.00 లక్కీ ఛాన్స్
ఉ.09.30 కూలీ
మ.12.00 శ్రీ షిర్డి సాయిబాబా మహాత్మ్యం
సా.06.00 బద్రి
రా.09.00 గగనం



మూవీస్ నౌ
ఉ.06.00 షాంఘై నూన్
ఉ.11.25 ఎంటర్ ద డ్రాగన్
మ.03.05 ఆక్టోపస్సీ
రా.07.15 జార్జ్ ఆఫ్ ద జంగిల్
రా.10.50 క్యాసినో రాయల్



హెచ్‌బీవో
ఉ.07.56 ద కరాటే కిడ్-2
మ.12.03 మ్యాన్ ఆఫ్ స్టీల్
మ.02.27 పుస్ ఇన్ బూట్స్
సా.05.53 ద డిక్టేటర్
రా.09.00 కుంగ్‌ఫు పాండా 2



స్టార్ మూవీస్
ఉ.06.55 ఏలియన్ వర్సెస్ ప్రిడేటర్
ఉ.11.15 కుంగ్‌ఫు హ్యాసిల్
మ.01.11 ఐస్ ఏజ్
సా.04.32 జుమాంజీ
రా.09.00 స్పీడ్



మా మూవీస్
ఉ.07.00 గోకులంలో సీత
మ.12.00 హ్యాపీ
మ.03.00 శ్రీ
సా.06.00 అందరివాడు
రా.09.00 హలోబ్రదర్



జీ సినిమా
మ.12.23 రామయ్యా వస్తావయ్యా
మ.03.20 లింగా
సా.06.09 డేరింగ్‌బాజ్ 3
రా.09.00 శూర్‌వీర్
రా.11.49 షేర్ ఏ జిగర్

తిరుమల సమాచారం

తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ చాలా తక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే పరిస్థితి లేకుండా డైరెక్ట్‌గా పంపించేస్తున్నారు.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు	–	10 ఖాళీ
రూ.50 గదులు	–	25 ఖాళీ
రూ.100 గదులు	–	55 ఖాళీ
రూ.500 గదులు	–	10 ఖాళీ

సేవలు

సహస్ర దీపాలంకరణ	–	240 ఖాళీ
వసంతోత్సవం	–	150 ఖాళీ
ఆర్జిత బ్రహ్మోత్సవం	–	200 ఖాళీ

గురువారం ప్రత్యేక సేవ : తిరుప్పావడ



బాసర ఆలయ సమాచారం

బాసర : అన్నదానం రోజు 12.30 గంటలకు ప్రారంభం

శ్రీసరస్వతీ అమ్మవారి ఆలయంలో నిత్యపూజలు ..దర్శన వేళలు

ఉదయం : 04.00 దేవాలయం తెరుచుట, 07.30 గం॥ వరకు శ్రీ అమ్మవారి అభిషేకం, అలంకరణ, హారతి, ప్రసాదాల వితరణ 07.30–12.30గం వరకు సర్వదర్శనం

మధ్యాహ్నం: 12గం॥–12,30 గ॥ వరకు నివేదన హారతి, 12.30 నుండి 2 వరకు ద్వారబంధనం, 2 గంటల నుంచి 6 గంటల వరకు సర్వదర్శన, ఇతర పూజలు

సాయంత్రం : 6.30నుంచి ప్రదోషపూజ, 10.30 గంటలకు మహా– హారతి తీర్థప్రసాదం, ద్వారబంధనం, ఇతర పూజలు

అమ్మవారి ఆలయంలో ముఖ్య పండుగలు

శ్రీవ్యాసపౌర్ణమి–దసరా నవరాత్రోత్సవాలు
శ్రీ వసంత పంచమి – మహాశివరాత్రి

ఫోన్ నంబర్లు ....

గదుల కొరకు	08752–255503
ఈవో కార్యాలయం	255550
కార్యనిర్వహణాధికారి	255903
రైల్వేస్టేషన్	255504
పోలీస్ స్టేషన్	255120
వైశ్యసత్రం	255521
బ్రాహ్మణ సత్రం	255522





Padi-Panta

మూగజీవాలపై రసాయనాల ప్రభావం

- పత్తి చేలలో మూగజీవాలను మేపవద్దు
- తీసుకోవాల్సిన జాగ్రత్తలు

చెన్నూర్‌రూరల్: రైతులు అధిక లాభాలను ఆశించి సాగు చేస్తున్న వాణిజ్య పంటలు, ఇతర పంటలకు ఆశించిన చీడ, పీడల నివారణకు ఎక్కువగా క్రిమి సంహారక మందులు ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మూగజీవాలు చేలల్లో మేస్తే మత్యువాత పడే అవకాశాలు ఉన్నాయి. విష ప్రభావం ఉన్న వాటిని తింటే మూగజీవాలు పలు రకాల వ్యాధుల బారిన పడే అవకాశాలున్నాయని కత్తెరసాల పశువైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఖరీఫ్ పంటల సాగు పూర్తవగానే పత్తి కర్రలకు ఉన్న ఆకులను, ఇతర పంటలను మూగజీవాలు తింటుంటాయి. దీంతో వాటికి ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి.

విష ప్రభావం ఇలా..

జీవం బలహీన పడడం, మేత మేయక పోవడం, పొట్ట ఉబ్బడం, జీర్ణ వ్యవస్థ పనితీరు మందగించడం, నల్లటి విరేచనాలు, నోటి వెంట చొంగ, సొల్లు కారడం, మూత్రంలో రక్తం రావడం, దగ్గు, దమ్ము, ముక్కు వెంట చీమిడి కారడంతో పాటు కాళ్లు వణకడం కొట్టు కోవడం చేస్తుంటాయి. ఇలా అయిన తర్వాత 5–6 రోజుల వ్యవధితో మూగజీవాలు మరణించే అవకాశముంది.

నివారణ చర్యలు..

విష ప్రభావానికి గురైన మేకలను, గొర్రెలను సరైన సమయంలో పశు వైద్యుడి దగ్గరకు తీసుకు వెళ్లి ప్రథమ చికిత్స చేయించాలి. ముఖ్యంగా ఊపిరితిత్తులు, కాలేయం విష ప్రభావానికి లోనవుతుంది. ఎన్రో ఫ్లాక్సాసిన్ మందును నోటి ద్వారా 2–3 రోజులు అందించాలి. ఇతర విరుగుడు మందులు అట్రోఫిన్ సల్ఫేట్ అందజేయాలి. పత్తి పంటలో పత్తి ఏరడం అయిపోయిన తర్వాత ముఖ్యంగా పశువులను, మేకలు, గొర్రెలు తినకుండా చూడాలి. పురుగుల మందులను పశువులు తిరిగే పాకల్లో ఉంచడం వల్ల కొన్ని సమయాల్లో అవి ఆ మందు తాగినప్పుడు పశు, జీవాల ప్రాణాలకు ప్రమాదాలు ఏర్పడతాయి. పశువులు, జీవాలకు నీరు దొరకని సమయాల్లో పంట పొలాల దగ్గర నీటిని తాగుతుంటాయి. రసాయన ఎరువులు వేసిన తర్వాత ఆ పొలంలోని నీటిని తాగించడం వలన కూడా విష ప్రభావంతో కడుపులో మంట కారణంగా కొన్ని పశువులు గట్టిగా అరుస్తూ ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో అట్రోఫిన్ సల్ఫేట్, సెలైన్ ద్రావణం రక్తంలోకి ఎక్కించాలి. ఇవి అందుబాటులో లేకపోతే చార్‌కోల్ లేదా కర్రల బొగ్గును మెత్తటి పొడిగా చేసి 2లీటర్ల నీటిలో కలిపి తాగించాలి. లేదా కోడి గుడ్డు తెల్లటి సోనను తాగించాలి. ఇలా చేస్తే విష ప్రభావం సోకిన మూగజీవాలకు కొంత వరకు ప్రమాదం తప్పుతుంది. ఇలాంటి జాగ్రత్తలు పాటించి పశువులను, మూగజీవాలను కాపాడుకోవాలి.



శ్రీనివాస్ పశు వైద్యాధికారి, కత్తెరసాల


పత్తి చేనులో మేస్తున్న మేకలు, గొర్రెలు



భవిష్యం

మేషం: పనులు ముందుకు సాగక నిరాశ చెందుతారు. ధనవ్యయం. అనారోగ్య సూచనలు. బంధు వర్గంతో విభేదాలు. వృత్తి, వ్యాపారాలలో గందరగోళం.

వృషభం: ప్రముఖుల నుంచి పిలుపు అందుకుంటారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకం. పలుకుబడి పెరుగుతుంది. వస్తులాభాలు. వృత్తి, వ్యాపారాలు సజావుగానే సాగుతాయి.



మిథునం: మిత్రులే శత్రువులుగా మారతారు. అనుకోని ఖర్చులు. ఆరోగ్యభంగం. శ్రమ తప్పదు. పనుల్లో అవరోధాలు. వృత్తి, వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

కర్కాటకం: దూరప్రాంతాల నుంచి శుభవార్తలు. వాహనయోగం. భూవివాదాల పరిష్కారం. ఆస్తి విషయంలో ఒప్పందాలు. వృత్తి,వ్యాపారాలలో ముందడుగు వేస్తారు.

సింహం: పనులు వాయిదా వేస్తారు. ఆర్థిక ఇబ్బందులు. రుణదాతల ఒత్తిడులు. మిత్రులతో వివాదాలు. వృత్తి,వ్యాపారాలు నిరాశ పరుస్తాయి.

కన్య: కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. ప్రముఖులతో పరిచయాలు. సంఘంలో ఆదరణ. వస్తు, వస్త్రలాభాలు. వ్యాపార, ఉద్యోగాలలో నూతనోత్సాహం.

తుల: ఇంటర్వ్యూలలో విజయం. ఆప్తుల సలహాలు పాటిస్తారు. పాతమిత్రుల కలయిక. భూములు, వాహనాలు కొంటారు. వృత్తి, వ్యాపారాలలో అనుకూల వాతావరణం.

వృశ్చికం: రుణదాతల ఒత్తిడులు. అనుకోని ప్రయాణాలు. ఇంటాబయటా సమస్యలు. బంధువుల తాకిడి పెరుగుతుంది. వృత్తి, వ్యాపారాలలో చిక్కులు.

ధనుస్సు: శ్రమ తప్ప ఫలితం ఉండదు. పనుల్లో జాప్యం జరిగే అవకాశం ఉంది. రాబడికి మించి ఖర్చులు అవుతాయి. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

మకరం: మిత్రుల సలహాలు పాటిస్తారు. సంఘంలో గౌరవం. ఆస్తి వివాదాల నుంచి బయటపడతారు. వస్తు లాభాలు. వృత్తి, వ్యాపారాలలో అనుకూలం.

కుంభం: గత సంఘటనలు గుర్తుకు వస్తాయి. సభలు,సమావేశాలలో పాల్గొంటారు. బాకీలు వసూలవుతాయి. దైవదర్శనాలు. వృత్తి, వ్యాపారాలలో పురోగతి.

మీనం: కొన్ని కార్యక్రమాలు హఠాత్తుగా విరమిస్తారు. శ్రమాధిక్యం. నిర్ణయాలు మార్చుకుంటారు. ఆధ్యాత్మిక చింతన. వ్యాపారాలలో స్వల్ప లాభాలు. ఉద్యోగులకు నిరుత్సాహం.

– సింహంభట్ల సుబ్బారావు



చికెన్ (సుగుణ)	స్కిన్	స్కిన్‌లెస్
	120	140



హలో సాక్షి..

మంచిర్యాల టౌన్(ఆర్‌సీ)	9010204423
మంచిర్యాల సిటీ	9603505050
మంచిర్యాల క్రైం	9704646937
మంచిర్యాల అర్బన్	9866342353
మంచిర్యాల అగ్రికల్చర్	9985600781
హాజీపూర్	9849248188
శ్రీరాంపూర్	9030777044
నస్పూర్	9177778751
లక్సెట్టిపేట	9849954456
దండేపల్లి	9963306884
జన్నారం	9492132722

సావిత్రిబాయిలా పేరు తెచ్చుకోవాలి

సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని మండలాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఆమె చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల పట్టణంలో బీసీ భవనంలో బుధవారం సావిత్రి బాయిపూలే 187వ జయంతి వేడుకలను బీసీ విద్యార్థి, యువజన సంఘం అద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘాల నాయకులు మాట్లాడుతూ సావిత్రీబాయిపూలే అణగారిన వర్గాలను అక్షరవైపు తిప్పిన మొట్టమొదటి మహిళ అని కొనియాడారు. మహిళా సాధికరత కోసం ఎంతో శ్రమించిందన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సల్మాన్, చంద్రమోహన్, తిరుపతి, కుమార్, సురేష్, సాయిక్రిష్ణ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంఈవో

జన్నారం: వ్యయ ప్రయాసాల కోర్చి, కష్టపడి ఉపాధ్యాయ వృత్తిలో చేరిన ప్రతి మహిళ ఉపాధ్యాయురాలు మరో సావిత్రి బాయి పూలే లా పేరు తెచ్చుకోవాలని ఎంపీపీ చెటుపల్లి రాజేశ్వరి, ఎంఈవో విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకుని మహిళ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా మండలానికి చెందిన మహిళ ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రధా నోపాధ్యాయులు మధుసుదన్, రాజునాయక్, రాజుకుమార్, మోహన్ , జయప్రద,వెంకటరమణ ఉన్నారు .



నివాళి అర్పిస్తున్న చత్రపతి సాహు మహరాజ్ సభ్యులు

లక్సెట్టిపేట: సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను మండలంలోని పలు పాఠశాలలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ గురుకుల పేరెంట్స్ ఆధ్వర్యంలో స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో చత్రపతి సాహు మహరాజ్ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వం బాలుర పాఠశాలలో జైభారత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ శ్రీనివాస్, జైభారత్ సభ్యులు ఎంఏ సలీం, హెచ్‌ఎంలు దారతి, చత్రపతి సాహు సభ్యులు అరుణ్, శేఖర్, శ్రీనివాస్, రేగుంట లింగయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్బంగా సీనియర్ ఉపాధ్యాయురాలు మాలవిదేవిని సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లచ్చిరాం, అడిచర్ల సాగర్, సంగీత, ప్రమీల, రచిత, గంగుతాయి, శ్రీలేఖ, లక్ష్మీనారాయణ, గంగాధర్ పాల్గొన్నారు.

సావిత్రిబాయి అడుగుజాడల్లో..

నస్పూర్: నస్పూర్ మండల కేంద్రం సీసీసీలోని సృష్టి ఇనిస్టిట్యూట్‌లో సావిత్రి బాయి పూలే 187వ జయంతి వేడుకలను తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక, బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మహిళా విద్య కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప సంస్కర్త సావిత్రిబాయి అని కొనియాడారు. మహిళా లోకానికి ఆమె చూపిన మార్గం అనిర్వచనీయమని పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక జిల్లా అధ్యక్షుడు చిప్పకుర్తి శ్రీని వాస్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె. సల్మాన్ పాషా, కార్తీక్, అఖిల్, ప్రశాంత్, కుమార్, పవన్‌కుమార్, షఫీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి మంజుల

దండేపల్లి: మొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను దండేపల్లి కస్తూరిబా విద్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఆమె చిత్రపటానికి విద్యాలయ ప్రత్యేకాధికారి మంజుల, సీఆర్టీలు, విద్యార్థులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

మురుగునీరు తొలగించరూ..



రోడ్డుపై నిలిచిన మురుగునీరు

దండేపల్లి: స్వచ్ఛ భారత్ ద్వారా పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేస్తుంటే మండలంలోని ముత్యంపేట ఎస్సీ కాలనీలో నాలుగు రోడ్ల నుంచి వచ్చే మురుగు నీరంతా ఒకే చోట నిలుస్తుంది. దీంతో ఈగలు దోమలు వృద్ధి చెంది కంపు వాసన వెదజల్లుతోంది. దీని కారణంగా వ్యాధులు కూడా ప్రబలే ప్రమాదం ఉంది. పంచాయతీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి నీరు నిల్వకుండా చేయాలి.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9010204423

న్యూస్ బాక్స్

'దళితులపై దాడి తీవ్రవాదంతో సమానం'

నస్పూర్: మహారాష్ట్రలో 'భీమా కోరెగావ్'లో శాంతియుతంగా దళితులు ర్యాలీ నిర్వహిస్తుంటే అక్కడి మనువాద సంస్థలు హింసాత్మక సంఘటనలకు పాల్పడడం తీవ్రవాదంతో సమానమని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కాదాసి రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి డెబ్బైఏళ్ల గడుస్తున్నా దళితులకు స్వేచ్ఛ సమానత్వం లేదని, మనువాద సంస్థలకు మాత్రం అన్ని రకాలుగా స్వేచ్ఛ ఉందన్నారు. మానవులను మానవులుగా గుర్తించని మనువాద సంస్థలను నిషేధించాలని, దళితులపై జరిగిన దాడిలో చనిపోయిన, గాయపడిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ప్రారంభం

మంచిర్యాలటౌన్: సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని స్వేరోస్ ఆధ్వర్యంలో పట్టణంలోని సాయికుంటలో గల ఎస్టీ ఉమెన్స్ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విజ్ఞాన కేంద్రాన్ని బుధవారం మంచిర్యాల డీసీపీ వేణుగోపాల్ ప్రారంభించారు. ఈ కేంద్రంలో మహనీయుల చరిత్రలు, గ్రూప్ 1, 2లతో పాటు సివిల్ సర్వీసెస్‌కు అవసరమైన సుమారు రూ. 30 వేల విలువ గల పుస్తకాలను అందుబాటులో ఉంచినట్లు స్వేరోస్ నాయకులు తెలిపారు. స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజహర్, జోనల్ అధ్యక్షుడు లక్ష్మణ్‌దాస్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకరి రమేశ్ పాల్గొన్నారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

నస్పూర్: మహారాష్ట్రలోని భీమా కోరేగావ్‌లో దళితులపై దాడులకు పాల్పడిన ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ మతతత్వవాదులపై కఠినచర్యలు తీసుకోవాలని బహుజన విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం శ్రీరాంపూర్‌లో జరిగిన సమావేశంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు చంద్రగిరి నరేశ్ మాట్లాడారు. కేంద్రలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి దళితులపై దాడులు అధికమయ్యాయని తెలిపారు. రెండు వందల ఏళ్ల క్రితం జరిగిన పోరాటంలో సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ దళితులు జరుపుకుంటున్న వేడుకపై మతతత్వ వాదులు దాడులకు పాల్పడి దళితులను అణిచివేయాలని చూస్తున్నాయని అన్నారు. ఈ సంఘటనపై సుప్రీంకోర్టు న్యాయవాదితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనలో చనిపోయిన, గాయాలపాలైన వారికి నష్టపరిహారం చెల్లించాల ని కోరారు. కార్యక్రమంలో చత్రపతి సాహు మహరాజ్ జిల్లా అధ్యక్షుడు చిట్యాల విక్రమ్, ఆమ్‌ఆద్మీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు నల్ల నాగేంద్రప్రసాద్, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి విజయసాగర్, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్.కిరణ్, నాయకులు కోంద్ర ఉదయ్, గారె వెంకటేశ్, అయిత జ్ఞానేశ్వర్, సీపెల్లి సందీప్, చిప్పకుర్తి ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బహుజన విద్యార్థి సంఘాల నాయకులు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ



శుభ్రం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ సభ్యులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక వొకేషనల్ జూనియర్ కాలేజీ ఆధ్వర్యంలో సాయికుంటలో పరిసరాల పరిశుభ్రతపై జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) సభ్యులు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీదేవి, పద్మ, పోరెడ్డి సంతోష్, తుకారం, 50 మంది ఎన్‌ఎస్‌ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

పుత్ర కామేష్టి యాగం పూర్తి



యాగంలో పాల్గొన్న దంపతులు

యాగం చేయిస్తున్న సత్యవీర్ స్వామిజీ

నర్సాపూర్: మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని సువిజ్ఞాన ఆశ్రమంలో బుధవారం వ్యవస్థాపకులు ఆచార్య సత్యవీర్‌స్వామిజీ ఆధ్వర్యంలో పుత్ర కామేష్టి యాగం నిర్వహించారు. పుష్యమాసంలో పుష్యమి నక్షత్రంనాడు ఈ యాగం చేస్తే, యాగంలో వాడే ఔషధాలు మంచి ఫలితాలు ఇస్తాయని ఆయన పేర్కొన్నారు. అందుకే ఈ రోజు యాగం చేశామన్నారు. ఇందులో 45 మంది దంపతులు పాల్గొన్నారని చెప్పారు. అనంతరం వారికి యోగాసనాలు, ప్రాణాయామం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. యాగం నిర్వహణలో స్వామిజీతోపాటు, యోగా సిద్ధిరాములు పాల్గొన్నారు. ఇంకా వివరాలు తెలుసుకోవాలనుకుంటున్న వారు 9248828666లో సంప్రదించవచ్చని సూచించారు. యాగం మళ్లీ ఈ నెల 31న జరుగుతుందని తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వండి

- కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేసిన మంత్రి జోగు రామన్న
- ఆదిలాబాద్ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయండి
- సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సహకరించాలని విన్నపం
- మంత్రి వెంట ఎంపీ నగేశ్, వేణుగోపాలాచారి



కేంద్ర మంత్రితో భేటీలో మంత్రి జోగురామన్న, ఎంపీ నగేశ్, వేణుగోపాలాచారి

ఎదులాపురం(ఆదిలాబాద్): ఢిల్లీ పర్యటనకు వెళ్లిన రాష్ట్ర అటవీ, పర్యావరణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న పలువురు కేంద్ర మంత్రులను కలిసి అభివృద్ధి పనులకు నిధులివ్వాలని కోరారు. రాష్ట్రంలో, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు రావాల్సిన నిధుల విషయంలో కేంద్ర మంత్రులతో చర్చించారు. మంత్రి వెంట ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, అధికార ప్రతినిధి వేణుగోపాలాచారి తదితరులు ఉన్నారు. మొదట కేంద్ర మంత్రి మహేశ్‌శర్మను కలిసి ఆదిలాబాద్‌లో జంతు, పశు జీవవైవిధ్య ప్రదర్శనశాల ఏర్పాటుపై చర్చించినట్లు తెలిపారు. దీనిపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి రూ.185 కోట్లతో ప్రతిపాదనలు అందించిందని, ఇందులో వాటా రూ.125 కోట్లు త్వరగా విడుదల చేయాలని కోరారు. మిగిలిన వాటాలో రాష్ట్ర ప్రభుత్వం రూ.45 కోట్లు, అంకుశ్ స్వచ్ఛంద సంస్థ రూ.20 కోట్లు ఇచ్చే నిధులతో ప్రాజెక్టు పూర్తి చేయనున్నట్లు మంత్రి వివరించారు. కరీంనగర్ హెడ్ క్వార్టర్స్‌లో కేటగిరి వన్ విభాగంలో సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి మహేశ్‌శర్మ ఫిబ్రవరి 6న హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఈ అంశాలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు.

- అనంతరం సామాజిక, న్యాయ శాఖ మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్‌తో బీసీ వర్గాల సమస్యలు, స్కాలర్‌షిప్‌లపై చర్చించారు. కొత్తగా 15 బీసీ హాస్టళ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు గతంలోనే కేంద్రానికి పంపామని, అందుకు సంబంధించిన నిధులు, అనుమతులు త్వరగా విడుదల చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పోస్ట్‌మెట్రిక్, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను త్వరగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 113 బీసీ కులాలు ఉన్నాయని, ఇందులో కేవలం 85 కులాలను మాత్రమే ఓబీసీ కులాలుగా గుర్తించబడ్డాయని మంత్రి తెలిపారు. మిగిలిన కులాలను ఓబీసీలుగా గుర్తించకపోవడంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో వారికి అన్యాయం జరుగుతున్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్ త్వరలోనే ఓబీసీ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారన్నారు. కమిషన్ ఏర్పాటుతో ఓబీసీ సమస్య పరిష్కారమవుతోందని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని మంత్రి జోగురామన్న తెలిపారు.
- రాష్ట్ర అభివృద్ధిపై కేంద్ర పర్యాటక శాఖ మంత్రి ఆల్ఫాన్స్‌తో చర్చించారు. ఆదిలాబాద్‌లో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయన్న మంత్రి, అంతర్జాతీయ సందర్శకులను ఆకర్శించే దిశలో రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగా కుంటాల, పొచ్చెర జలపాతాలను జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించి అభివృద్ధి చేయడానికి సంబంధించిన రూ.141 కోట్లతో కూడిన ప్రతిపాదనలు కేంద్రానికి గతంలో పంపామని గుర్తు చేశారు.
- కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి అనంత్‌గీతేతో రాష్ట్రంలోని భారీ పరిశ్రమల అభివృద్ధి అంశాలపై చర్చించారు. రామగుండం ఫర్టిలైజర్, సీసీఐ ఏర్పాటుపై చర్చించగా, ఈ రెండు అంశాలను త్వరలోనే పరిష్కరిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని మంత్రి పేర్కొన్నారు. వారి వెంట సీతారాం నాయక్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

డీఎఫ్‌వోకు ఉత్తమ సేవా పురస్కారం

- కొత్త ఏడాదిని పురస్కరించుకొని ప్రకటించిన ప్రభుత్వం
- గతంలో పలు అవార్డులు అందుకున్న డీఎఫ్‌వో
- జిల్లాలో అగ్నిమాపక నివారణలపై విస్తృత ప్రచారం



డివిజనల్ అధికారి సారంగి సందన్న

ఆదిలాబాద్: తెలంగాణ రాష్ట్రంలో అగ్నిప్రమాదాల నివారణ, అవగాహన కార్యక్రమాలకుగాను ఉమ్మడి జిల్లా అగ్నిమాపకశాఖ డివిజనల్ అధికారి సారంగి సందన్నకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పథక పురస్కారం ప్రకటించింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గతేడాదిలో చేసిన సేవలకుగాను ప్రభుత్వం ఆయా విభాగాల్లో ఈ పురస్కారాలకు ఉత్తమ అధికారులను ఎంపిక చేసింది. గతేడాదిలో డీఎఫ్‌వో జిల్లాలో అగ్నిప్రమాదాలు నివారణతోపాటు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 540 పాఠశాలల్లో ఫైర్ డ్రిల్ నిర్వహించారు. గతేడాది ఏడు భారీ అగ్నిప్రమాదాలు, 643 చిన్న అగ్నిప్రమాదాలు మాత్రమే జరిగాయి. జిన్నింగ్ మిల్లులు, పాఠశాలలు, ఆస్పత్రుల్లో ఎప్పటికిప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతోపాటు హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కల రక్షణ, నీటి సరఫరా సైతం శాఖ నుంచి చేశారు. 2012లో ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు కూడా ఈయనకు సేవా పథకం అందుకున్నారు. 2013, 2015 సంవత్సరాల్లో ఉత్తమ అధికారిగా అవార్డులు దక్కా యి. జిల్లాతోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాలో ఆకస్మిక తనిఖీల్లో పాల్గొన్నారు. గతేడాది ఖానాపూర్, చెన్నూర్ ప్రాంతాల్లో అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటుకు స్థల సేకరణ చేశారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ఫైర్‌స్టేషన్‌లకు కొత్త వాహనాలు వచ్చేలా చూశారు. ఇవన్నీ గతేడాదిలో చేసిన సేవలకు ప్రభుత్వం పథకానికి ఎంపిక చేసింది. పురస్కారం రావడంపై సందన్న సంతోషం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు డీసీసీ అధ్యక్షుడి తనయుడి ఎంపిక



ఏలేటి సృంజిత్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తనయుడు ఏలేటి సృంజిత్ రెడ్డి ఎంపికయ్యాడు. చిన్న వయస్సులోనే అండర్ 14 రాష్ట్ర క్రికెట్ జట్టులో స్థానం సంపాదించారు. సృంజిత్‌రెడ్డి వయస్సు ప్రస్తుతం 11ఏళ్లు. అండర్-14 జట్టు ఎంపిక కోసం నిర్వహించిన పోటీల్లో సృంజిత్ సత్తా చాటి జట్టులో స్థానం సంపాదించాడు. ఇప్పటికే సృంజిత్‌రెడ్డి ఆల్‌రౌండర్‌గా పలు మ్యాచ్‌లలో ఉత్తమ ప్రతిభ చాటాడు. ఇప్పటివరకు ఆయన ఆడిన 9మ్యాచ్‌లలో 4 సార్లు 5 వికెట్లు సాధించడంతోపాటు, 3 సార్లు 4 వికెట్లు పడగొట్టి మొత్తం 33 వికెట్లు సాధించాడు. కేరళలో ఈ నెల 7 నుంచి 21వరకు జరిగే మ్యాచ్‌లలో ఆయన రాష్ట్ర జట్టు తరపున ఆడనున్నారు. ఈ మేరకు జనవరి 5న కేరళకు బయలుదేరి వెళ్లనున్నారు.

నిజాయతీ చాటిన రైతు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నల్ల రాజయ్య అనే రైతు బుధవారం తన నిజాయితీతో ఖాతాలో జమ అయిన అదనపు డబ్బులను తిరిగి ఏకేపీ అధికారులకు అందజేశారు. వివరాల్లోకి వెళ్లితే..నర్సింగాపూర్ గ్రామ రైతు రాజయ్య తన ధాన్యంను ఐకేపీ కొనుగోలు కేంద్రంలో విక్రయించాడు. దీనికి సంబంధించి ధాన్యం డబ్బులు రాజయ్య బ్యాంకు ఖాతాలో రూ.24,779 జమ చేశారు. తిరిగి మళ్లీ అదే ఖాతాలో మరో రూ.24,779 అదనంగా జమ కావడంతో అవాక్కయ్యాడు. వివరాలు పరిశీలించి ఐకేపీ వీఓ, సీఏల తప్పిదంతో అదనంగా డబ్బులు జమ అయినట్లు తెలుసుకుని వాటిని తిరిగి డీడీ రూపంలో ఐకేపీ అధికారులకు అందజేశారు. రైతు రాజయ్య ఖాతాలో జమ అయిన డబ్బులు తిరిగి ఇవ్వడంతో అధికారులు అభినందించారు.



డబ్బులను ఐకేపీ అధికారులకు అప్పగిస్తున్న రైతు



'స్వచ్ఛత'పై సర్వే

రాష్ట్రంలో పర్యటించనున్న కేంద్ర బృందం

మున్సిపాలిటీల్లో స్వచ్ఛ భారత్ కింద చేపడుతున్న కార్యక్రమాల ఆధారంగా ర్యాంకులు ఇచ్చేందుకు కేంద్రం నిర్ణయించింది. మెరుగైన ర్యాంకు సాధిస్తే కేంద్రం చేపట్టిన 'స్వచ్ఛ సర్వేక్షణ్ పథకం'లో చోటు కల్పిస్తారు. జనవరి 4వ తేదీ నుంచి దేశంలోని అన్ని మున్సిపాలిటీలను కేంద్ర బృందాలు పరిశీలించి ర్యాంకులివ్వనున్నాయి. తెలంగాణలో పర్యటించనున్న బృందం 73 మున్సిపాలిటీల్లో చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించనుంది.

- వికారాబాద్ నుంచి కొలను దివాకర్‌రెడ్డి

వచ్చేస్తోంది కేంద్ర బృందం..

గతంలో లక్ష జనాభాకుపైగా ఉన్న మున్సిపాలిటీలకే సర్వేక్షణ్ పథకాన్ని పరిమితం చేయాలని భావించారు. కానీ ప్రస్తుతం అన్ని మున్సిపాలిటీలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ జనవరి నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ అమలులోకి వచ్చింది. దేశంలో మొత్తం 4,041 మున్సిపాలిటీలను కేంద్ర అధికారుల బృందం పరిశీలించనుంది. తెలంగాణలో 73 మున్సిపాలిటీలను పరిశీలించనున్న నేపథ్యంలో పారిశుద్ధ్య పనులు జోరుగా సాగుతున్నాయి. పనితీరు మెరుగ్గా కన్పిస్తేనే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో చోటు లభించనుంది.

కేంద్రం పర్యటించే మున్సిపాలిటీలు

గ్రేటర్ హైదరాబాద్, ఆదిలాబాద్, భూపాలపల్లి, జనగామ, కాగజ్‌నగర్, కామారెడ్డి, మహబూబాబాద్, మెదక్, వరంగల్ అర్బన్, వనపర్తి, యాదాద్రి భువనగిరి మున్సిపాలిటీలతో పాటు గద్వాల జిల్లాలో రెండు, జగిత్యాలలో నాలుగు, కరీంనగర్ జిల్లాలో మూడు, ఖమ్మం జిల్లాలో మూడు, కొత్తగూడెం జిల్లాలో నాలుగు, మంచిర్యాలలో మూడు, మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు, మేడ్చల్‌లో మూడు, నిర్మల్‌లో రెండు, నాగర్‌కర్నూలు జిల్లాలో నాలుగు, నల్లగొండ జిల్లాలో మూడు, నిజామాబాద్ జిల్లాలో మూడు, పెద్దపల్లిలో రెండు, రంగారెడ్డి జిల్లాలో ఏడు, సిరిసిల్లలో రెండు, సిద్దిపేటలో నాలుగు, సంగారెడ్డిలో ఐదు, సూర్యాపేటలో మూడు, వికారాబాద్‌లో రెండు మున్సిపాలిటీలను కేంద్ర బృందం పరిశీలించనుంది.

స్వచ్ఛత సాధిస్తే నిధులు..


స్వచ్ఛత సాధిస్తే మున్సిపాలిటీలకు దండిగా నిధులను విడుదల చేసేందుకు కేంద్రం సిద్ధమైంది. గతంలో జాతీయ స్థాయిలో గ్రేటర్ హైదరాబాద్ 18వ ర్యాంకు, వరంగల్ మున్సిపాలిటీ 33వ ర్యాంకు సాధించాయి. ఇదే విధంగా లక్షలోపు జనాభా ఉన్న మున్సిపాలిటీలను స్వచ్ఛ సర్వేక్షణకు ఎంపిక చేస్తారు. దీంతో ఆ మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య, స్వచ్ఛత పనులు, ప్లాస్టిక్ నిషేధం తదితర పనులను బట్టి ర్యాంకులను ప్రకటిస్తారు. అనంతరం నిధులను విడుదల చేస్తారు.

ఊపందుకున్న పనులు..

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు పక్షం రోజులుగా స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. చెత్త తొలగింపుతోపాటు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని సూచిస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో మొత్తం 15 అంశాలను పరిగణనలోకి తీసుకుని మార్కులను కేటాయిస్తారు. ఒక్కో మున్సిపాలిటీకి 4000 మార్కులను కేటాయించారు. 1400 మార్కులు పారిశుద్ధ్యం, 1400 మార్కులు పౌర సేవలు, 1200 మార్కులు రికార్డుల నిర్వహణకు కేటాయించారు.

పరిశీలించే అంశాలు..

మున్సిపాలిటీలలో తడి, పొడి చెత్త వేరు చేస్తున్నారా.., వాణిజ్య ప్రాంతాల నుంచి చెత్తను సేకరిస్తున్నారా.., చెత్త నుంచి కంపోస్టు తయారీపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారా.., పాఠశాలల్లో స్వచ్ఛత కమిటీల పరిస్థితి, బహిరంగ మల, మూత్ర విసర్జన వంటి అంశాలను కేంద్ర బృందం పరిశీలిస్తుంది. పరిశుభ్రత సందేశాల ఏర్పాటు, వ్యర్థాల శుద్ధి, ప్రతి 500 మీ.లకు డస్ట్‌బిన్‌ల ఏర్పాటు, పెట్రోల్ బంకుల్లో టాయిలెట్ల ఏర్పాటు తదితర అంశాలనూ పరిగణనలోకి తీసుకుంటారు.



ఉపాధి 'కల్పన'


- ఎంప్లాయ్‌మెంట్ కార్డుపై నిరుద్యోగుల నిరాసక్తి
- యేటేటా తగ్గిపోతున్న రిజిస్ట్రేషన్ల సంఖ్య
- రెన్యూవల్ చేసుకోకపోవడంతో లక్షల్లో రిజిస్ట్రేషన్లు తొలగింపు
- ల్యాప్స్ కార్డుల పునరుద్ధరణకు ముగిసిన గడువు

ఆదిలాబాద్ నుంచి గొడిసెల కృష్ణకాంత్ గౌడ్ :


నోటిఫికేషన్లు లేవు.. కాల్ లెటర్లు రావు.. ఎంప్లాయ్‌మెంట్ కార్డుతో ప్రయోజనం లేదన్న నిరాసక్తత నిరుద్యోగుల్లో కనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి. ఈ శాఖ 'ఉత్తదే' అన్న అభిప్రాయం నిరుద్యోగుల్లో నెలకొంది. కొత్తగా రిజిస్ట్రేషన్లు చేసుకునే వారి సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది. రెన్యూవల్ చేసుకోకపోవడంతో ఇప్పటివరకు లక్షల్లో రిజిస్ట్రేషన్లను తొలగించారు. ప్రభుత్వం 2000 సంవత్సరం నుంచి ల్యాప్స్ అయిన కార్డుల పునరుద్ధరణకు గత నెల 31 వరకు అవకాశం ఇచ్చింది. అయినా చాలా మంది పునరుద్ధరించుకోలేదు. మొత్తంగా ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛ్సేంజ్ వ్యవస్థపై నమ్మకం సడలుతోంది.

జిల్లాకో ఉపాధి కల్పన శాఖ..

పాత జిల్లాల్లో ఒకట్రెండు ఉపాధి కల్పన శాఖ కార్యాలయాలుండేవి. జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో నిరుద్యోగుల సమాచారం నిక్షిప్తం చేసేవారు. ఏజెన్సీ, ఐటీడీఏ ప్రాంతాల్లో ఉపాధి కల్పన శాఖ కార్యాలయాలు ఇప్పటికీ పని చేస్తున్నాయి. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత ప్రతి జిల్లాకు ఒక కార్యాలయం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కొత్త రిజిస్ట్రేషన్లతో పాటు రెన్యూవల్స్ ప్రక్రియ జరుగుతోంది. రెండు, మూడేళ్ల కోర్సులు చేసినవారు జిల్లా శాఖలో, నాలుగేళ్ల పైబడి కోర్సులు చేసిన వారు హైదరాబాద్ ఎక్ఛ్సేంజ్‌లో నమోదు చేసుకోవాలి. సింగరేణి ఉద్యోగాల నియామకాలు, వారసత్వ ఉద్యోగాలకూ ప్రభుత్వం ఎంప్లాయ్‌మెంట్ కార్డును పరిగణనలోకి తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇతర ఉద్యోగాలకూ ఈ కార్డును ప్రామాణికంగా తీసుకుంటే తప్ప రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగే అవకాశం లేదు.



గత మూడేళ్లుగా లాప్స్ అయిన రిజిస్ట్రేషన్లు..



నామమాత్రంగా ప్లేస్‌మెంట్లు..

ఉపాధి కల్పన శాఖ ద్వారా ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో ప్లేస్‌మెంట్ల కోసం సెప్టెంబర్ వరకు 2107 నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఒక్క పోస్టుకు 1:20 చొప్పున 14,081 మంది నిరుద్యోగుల జాబితాను పంపించగా 158 మందికే ఉద్యోగావకాశాలు దక్కాయి. 2016లో 888 మందికి, 2015లో 503 మందికి ఉద్యోగాలొచ్చాయి. ఇంతకు ముందు 10వ తరగతి కాగానే ఎంప్లాయ్‌మెంట్ కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేసుకునేవారు. ఆ తర్వాత విద్యార్హతలు పెరిగిన కొద్దీ ఆ కార్డులో నమోదు చేసుకోవడం, ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గడువు ముగియక ముందే రెన్యూవల్ చేసుకోవడం జరిగేది. అప్పట్లో పలు ఉద్యోగాల నోటిఫికేషన్లు ఎంప్లాయ్‌మెంట్ శాఖ ద్వారానే వచ్చేవి. ఇప్పుడు నోటిఫికేషన్ల సమాచారం, కాల్ లెటర్లు లేకపోవడంతో పరిస్థితులు మారిపోయాయి. మెరిట్ ఆధారంగా నియామకాలు జరుగుతుండడంతో ఈ ప్రక్రియను ఎవరూ పట్టించుకోవడం లేదు.



జై జంగో.. జై లింగో

- జనసంద్రమైన 'కప్లె' పుణ్యక్షేత్రం
- దీక్షాదారుల ప్రత్యేక పూజలు
- వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు


పుణ్యస్నానాలు చేసి గుహనుంచి బయటికి వస్తున్న భక్తులు


బారులు తీరిన మహారాష, చత్తీస్‌గఢ్ భక్తులు

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలం తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దున ఉన్న శంకర్‌లొద్ది సమీపంలో గల కప్లె పుణ్యక్షేత్రం జనసంద్రమైంది. తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ భక్తులు వేలాదిగా తరలివచ్చి కప్లె గుహను సందర్శించారు. ఈ పుణ్యక్షేత్రానికి 3500 ఏళ్ల నాటి చరిత్ర ఉందని కటోడా సిడాం భీము చెప్పారు. సాధారణ భక్తులతో పాటు 'జై జంగో.. జై లింగో' భక్తులు కూడా భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఇక్కడ జంగుబాయి, భీమదేవర, పోచమ్మ తల్లి బస చేసి ఉందని భక్తుల నమ్మకం.


గుహలోకి వెళ్తున్న భక్తులు

పాదాలపై నడుస్తూ..

భక్తులు గుహలోని దేవాతా మూర్తులను దర్శించుకునేందుకు సుమారు కిలో మీటరు దూరం గుహలో కూర్చుని పాదాలపై వెళ్లి పవిత్రమైన నదిలో పుణ్యస్నానాలు చేశారు. గుహ మధ్యలో 'దొంగల గుర్తు పట్టే దర్వాజ' కూడా ఉంది.

శివలింగాన్ని దర్శించుకున్న భక్తులు..

నెల రోజులుగా నియమ నిష్టలతో చేపట్టే జై జంగో.. జై లింగో స్వాములతోపాటు భక్తులు శంకర్‌లొద్ది సమీపంలోని శివలింగాన్ని దర్శించుకున్నారు. జై జంగో.. జై లింగో నామస్మరణతో శంకర్‌లొద్ది దద్దరిల్లింది.


శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు


గుహ లోపల నీటి గుండంలో స్నానాలు చేస్తున్న భక్తులు


దుర్గాదేవి ప్రతిమను బయటికి తీసుకవస్తున్న భక్తులు


శివలింగం దర్శనానికి బారులు తీరిన భక్తులు

'గంగ' తీరం.. జన సాగరం


రామానంద్, మాధవరావు చిత్రపటాలు

జైనథ్(ఆదిలాబాద్): జైనథ్ మండలంలోని డొల్లార గ్రామ సమీపంలో పెన్‌గంగ నదీ తీరాన బుధవారం నిర్వహించిన గంగ జాతరకు భక్తజనులు పోటెత్తారు. భక్తులు నదిలో పుణ్య స్నానాలు ఆచరించి పిండి వంటలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం నది ఒడ్డున గల రామానంద్, మాధవురాజ్ మహారాజ్‌ల ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. నదీతీరంలో రథ ప్రతిష్ఠ నిర్వహించారు. మహారాజ్‌ల పాదుకలను మహారాష్ట్రలోని బోరి సంస్థాన్ నుంచి పాదయాత్రగా తీసుకువచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. అనంతరం భక్తుల దర్శనార్థం రథయాత్ర ఏర్పాటు చేశారు. గంగ మాతకు హారతి, ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. గత 129 ఏళ్ల నుంచి ఈ జాతర ఉత్సవాలు ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


కాల దహీహండీ నిర్వహిస్తున్న భక్తులు

ఆకట్టుకున్న జాతర..

నదీ తీరాన నిర్వహించిన జాతర ఆకట్టుకుంది. రంగులరాట్నం, మౌత్‌క కూవ, డిస్నీ డ్యాన్స్‌లతో పాటు దుకాణ సముదాయాలు ఆకట్టుకున్నాయి.


భజనలు చేస్తున్న భక్తులు


జనసంద్రమైన గంగా నదీ తీరం


గంగమ్మకు మొక్కుతున్న యువతి

- అంధత్వాన్ని జయిస్తున్న విద్యార్థులు
- కళ్లు లేకున్నా చదువులో రాణింపు
- నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి, 6న వర్ధంతి

చుట్టూ చీకట్లు.. వెలుగులు చూడని జీవితాలు.. ప్రపంచం ఎలా ఉంటుందో తెలియదు.. అద్దంలో తన రూపమెలా ఉంటుందో చూడలేదు.. భవిష్యత్ అంతా నలుపే.. అనుకున్న వారి జీవితాల్లో వెన్నెల కాసింది. చూపులేని వాళ్లకు దారిచూపింది.. జీవితానికి సరిపడా అక్షర వెలుగుల్ని నింపింది. ఆ వెన్నెలే లూయి బ్రెయిలీ.. అంధుల కోసం ఒక లిపిని రచించి ఆరాధ్య దైవంగా నిలిచాడు. నేడు ఆయన జయంతి సందర్భంగా మంచిర్యాలలోని అంధుల పాఠశాలను 'సాక్షి' సందర్శించింది. విద్యార్థులతో ముచ్చటించింది..

బ్రెయిలీలిపితో అక్షరాలు రాస్తున్న అంధ విద్యార్థులు



అంధులకు 'బ్రెయిలీ' వెలుగు

ఉమ్మడి జిల్లాలో ఏకైక అంధుల పాఠశాల

ఉమ్మడి జిల్లాలో అంధులు 500లకు పైగానే ఉన్నారు. వీరికి ప్రభుత్వం తరుపున ప్రత్యేక పాఠశాలలు లేవు. మంచిర్యాల పట్టణంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'సాయి అంధుల పాఠశాల'ను ఏర్పాటు చేసి గత ఎనిమిదేళ్లుగా పలువురు అంధ విద్యార్థులకు ఉచితంగా విద్యను, వసతిని అందిస్తున్నారు. దాతల సహాయంతో నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 20 మంది అంధ విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు, భోజన వసతిని కల్పిస్తున్నారు. మరికొందరు హైదరాబాద్‌లోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో చదువుతున్నారు. మంచిర్యాల అంధుల పాఠశాలలో వీరికి విద్యతో పాటు, సంగీతం, నృత్యం, వాయిద్యం, యోగా, మెడిటేషన్, కరాటే, అబాకస్, ఆటలు, కంప్యూటర్‌లో శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వమే ఒక అంధుల పాఠశాలను నెలకొల్పి, వారికి విద్యను అందించేలా అన్ని ఏర్పాట్లు చేస్తే జిల్లాలోని అంధులకు మరింత లబ్ధి చేకూరే అవకాశం ఉంది. బ్రెయిలీ లిపి ద్వారా చదివేందుకు వీలుండగా, కంప్యూటర్ కీబోర్డులు సైతం అందుబాటులోకి రావడంతో వీరికి సాంకేతిక విద్య కూడా దగ్గరైంది.

జనవరి 4న జన్మించిన లూయిస్ బ్రెయిలీ

మంచిర్యాలటౌన్: 1809 జనవరి 4న లూయిస్ బ్రెయిలీ ప్యారీస్‌కు సమీపంలోని క్రూవే గ్రామంలో మోనిక్ బ్రెయిలీ, సైమన్‌రెనె బ్రెయిలీ దంపతులకు జన్మించారు. గుర్రాలశాలలో పని చేస్తున్న తండ్రితో పాటు వెళ్లిన బ్రెయిలీకి ఓ ప్రమాదంలో కళ్లు పోవడంతో తన నాలుగో ఏటనే బ్రెయిలీ పూర్తిగా గుడ్డివాడయ్యాడు. పాఠశాలకు వెళ్లి కేవలం వినడం ద్వారా పాఠాలు నేర్చుకున్నాడు. అక్షరాలు చదవలేని లూయిని చూసిన అతడి తండ్రి చెక్కపై అక్షరాలు చెక్కి ఇచ్చాడు. తర్వాత అంధుల పాఠశాలకు వెళ్లిన లూయిస్ లెన్‌టెప్ పద్ధతిలో రాగిరేకులపై రాసిన అక్షరాలను చదువుకోవాలంటే ఇబ్బందిగా ఉండేది. అయినా వాటిని అర్థం చేసుకుని చదువుకున్న లూయిస్, పాఠశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చేవాడు. తన 17వ ఏటనే అదే పాఠశాలలో లూయిస్ ఉపాధ్యాయుడిగా మారారు. అంధులకు చదువు చెప్పాలంటే వారికి లిపి కావాలి. స్పర్శ తప్ప మరో మార్గంలో వారు స్వయంగా చదువుకోలేరని గుర్తించాడు. అందుకే మామూలు ప్రింటింగ్ పద్ధతి కాకుండా, చేతి స్పర్శ తగిలేలా లిపిని రూపొందించాడు. ఉద్యోగం చేస్తూనే ఖాళీ సమయంలో ఐదేళ్లు కష్టపడి ఆరు చుక్కలతో కూడిన, సులభమైన లిపిని కనుగొన్నాడు. చుక్కల రూపంలో ఉన్న లిపిని తయారు చేసిన లూయిస్, ఆ లిపికి అతడి పేరులోని చివరి పదాన్ని కలిపి 'బ్రెయిలీ లిపి'గా మార్చాడు. ఆ లిపి కొద్ది రోజుల్లోనే ప్రపంచ ప్రాచుర్యం పొందింది. ఇప్పటికే బ్రెయిలీ లిపిలో అనేక గ్రంథాలు, పుస్తకాలు ముద్రించారు. కంప్యూటర్‌ను సైతం ఉపయోగించడంలోనూ అంధులు ముందుంటున్నారు. క్షయవ్యాధితో బ్రెయిలీ 1852 జనవరి 6న మరణించినా, తన లిపితో అంధుల గుండెల్లో కలకాలం జీవిస్తున్నాడు.



లూయి బ్రెయిలీ



సంగీత సాధనలో అంధ విద్యార్థి

చదువుకునే అవకాశం ఇచ్చారు



నేను చెన్నూర్ మండలం నర్సక్కపేట నుంచి వచ్చి ఇక్కడ చదువుతున్నాను. నాకు కళ్లు లేకున్నా అందరిలాగే చదువుకునే అవకాశం బ్రెయిలీ లిపితో కలిగింది. మేం చక్కగా రాయడం, చదవడం చేస్తున్నాం. ఇదే లిపితో బాగా చదువుకుని ఉన్నత స్థానానికి వెళ్లాలని ఉంది. మాలాంటి అంధులు ప్రతి ఒక్కరూ చదువుకుని, బ్రెయిలీ ఆశయాలకు అనుగుణంగా అంధులకు ఉపయోగపడేలా ఉండాలి.

- నగరం అంజలి, తొమ్మిదో తరగతి

ఆరు చుక్కలతోనే చదువు



ఆదిలాబాద్ మండలం తుర్కచాంద నుంచి వచ్చి ఇక్కడ చదువుతున్నాను. బ్రెయిలీ రూపొందించిన లిపిలో ఆరు చుక్కలతో తెలుగు, ఇంగ్లిష్ భాషలను చక్కగా నేర్చుకుంటున్నాం. అందరిలాగే మేం కూడా చదవడం, రాయడం చేస్తున్నాం. గుడ్డివారిగా పుట్టామన్న బాధను మరచిపోయేలా చదువుపై దృష్టి పెడుతున్నాం. బ్రెయిలీలా నేను కూడా బాగా చదువుకుని మంచి పేరు తెచ్చుకుంటాను.

- కొంతం సోనమ్మ, తొమ్మిదో తరగతి

మనో నేత్రమే ఆయుధం



వాంకిడి నుంచి వచ్చి మంచిర్యాలలో చదువుతున్నాను. అంధురాలిగా పుట్టాననే బాధ ఏమీ నాకు లేదు. మా పాఠశాలలో ఆ తేడానే రాకుండా మంచి బోధన అందిస్తున్నారు. తల్లిదండ్రులు దూరంగా ఉన్న బాధనే లేకుండా పోయింది. బాగా చదివి ఉన్నత ఉద్యోగం సాధించాలనే తపన నాలో ఉంది. మాకున్న మనోనేత్రం బ్రెయిలీలిపి, దీని సహకారంతో కష్టపడి బాగా చదువుతాను. మంచి ఉద్యోగం సాధిస్తాను. భవిష్యత్‌లో సమాజానికి సేవ చేయాలనుంది.

- పి. దీపిక, ఏడో తరగతి

ఎన్ని రోజులైనా అంధులకు సేవ చేస్తాం..



అంధులకు సేవ చేసేందుకు మేం ఎప్పుడూ సిద్ధమే. జిల్లాలోని నిరక్షరాస్యులైన అంధులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకోవడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం చేయూతను అందించకపోయినా, దాతలు అందిస్తున్న సహకారంతో మా పాఠశాల నడుస్తోంది. ప్రభుత్వం, దాతలు సహకరిస్తే ఎంతో మంది జీవితాల్లో అక్షర జ్యోతిని వెలిగించవచ్చు.

- అశోక్‌రావు, సాయి అంధుల పాఠశాల నిర్వాహకుడు






అంధ విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు



బ్రెయిలీ లిపిలో విద్యార్థులు రాసిన జవాబు పత్రం



బ్రెయిలీ లిపిని రాసేందుకు ఉపయోగించే పలక



న్యూస్ బాక్స్

క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి

- ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్
- చెన్నూర్‌లో సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సతీశ్‌కుమార్

చెన్నూర్: క్రీడాకారులు గెలుపోటములతో పట్టించుకోకుండా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో సెజ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్వర్యంలో బుధవారం మంచిర్యాల, కుమురం భీం జిల్లాల సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సతీశ్‌కుమార్ పోటీలను ప్రారంభించిన అనంతరం క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ గతంలో ఎన్నడూ లేనివిధంగా పథకాలను ప్రవేశపెడుతోందని చెప్పారు. మండలానికో మినీ స్టేడియం నిర్మాణంలో ఉన్నాయన్నారు. జిల్లాలోనే క్రీడాకారులకు చెన్నూర్ పుట్టినిల్లని, రిటైర్డ్ వ్యాయమ ఉపాధ్యాయులు కారెంగుల రామయ్య నేతృత్వంలో ఈ పోటీలు జరగడం సంతోషదాయకమని అన్నారు. కార్యక్రమంలో సెజ్ పాఠశాల ఎండీ పులి కిశోర్‌కుమార్, పులి చంద్రశేఖర్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష్య, కార్యదర్శులు కారెంగుల రామయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, సీఐ కిశోర్, గురుకృప స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేవీఎం ప్రకాశ్‌రావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సురేశ్‌బాబు, పీఈటీలు మనోహర్, దాసరి మల్లేశ్, జయశ్రీ, రామారావు, ఉమర్ పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యమే మహాభాగ్యం

- మానసిక ప్రశాంతత కోసం యోగా
- క్రీడా మైదానాల్లో సౌకర్యాల కల్పన

మందమర్రి: 'ఒకే కుటుంబం.. ఒకే గమ్యం.. ఒకే లక్ష్యం' అన్న సామెతను అక్షరాలా సుసాధ్యం చేస్తోంది సింగరేణి. బొగ్గు ఉత్పత్తి మాత్రమే కాదు కార్మికుల ఆరోగ్యం పరమావధిగా భావిస్తున్నదని చెప్పడానికి సంస్థ చేపడుతున్న పలు సంక్షేమ కార్యక్రమాలే నిదర్శనం. కార్మికులు అటు శారీరకంగా ఇటు మానసికంగా ఉత్సాహంగా ఉంటేనే బొగ్గు ఉత్పత్తి సాధ్యమన్న భావించి పలు చర్యలు తీసుకుంటున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా బొగ్గు ఉత్పత్తి పైనే దృష్టి సారించిన సింగరేణి ఉన్నతాధికారులు ఇటీవలి కాలంలో కార్మికుల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నారు. అన్ని ఏరియాల్లో యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులను ఇందులో భాగస్వాములను చేస్తున్న సంగతి తెలిసిందే. కార్మిక కాలనీల్లో ప్రచారం పెద్ద ఎత్తున నిర్వహించి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా చూస్తున్నారు.



కార్మికులు, వారి కుటుంబ సభ్యులు యోగాలో పాల్గొన్న దృశ్యం



మందమర్రిలోని స్విమ్మింగ్ పూల్

అన్ని గనులపై ప్రతి రోజూ..

యోగా కార్యక్రమాలను మైదానాల వరకే అధికారులు పరిమితం చేయలేదు. ప్రతిరోజు ఉదయం విధులకు హాజరయ్యే వారికి గని ఆవరణలోనే యోగాసనాలు వేయిస్తున్నారు. అదేవిధంగా ధ్యానం నిర్వహిస్తున్నారు. వీటి అనంతరం విధులకు వెళ్లేలా చూడాలని సంబంధిత అధికారులు నిర్ణయించారు. యోగాసనాలు, ధ్యానంతో కార్మికులు మానసికంగా ప్రశాంతత పొందుతారన్న ఆశయంతో వీటిని నిర్వహిస్తున్నారు. ఎలాంటి ఆందోళన లేకుండా విధులకు హాజరవడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయన్నది అధికారుల ఉద్దేశంగా కనిపిస్తోంది.

వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు..

కార్మికుల మానసికోల్లాసానికి ప్రధానమైన క్రీ డా మైదానాలను సంస్థ అధికారులు అభివృద్ధి చేస్తున్నారు. మందమర్రిలోని సింగరేణి ఉన్న త పాఠశాల మైదానంలో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకు రూ.5 లక్షలు వెచ్చించారు. ఏరియా పరిధిలోని రామకృష్ణాపూర్‌లోనూ వాకింగ్ ట్రాక్ నూతనంగా నిర్మించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ కోసం వచ్చే వారితోపాటు క్రీడాకారులైన కార్మికులకు ఇవెంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. ఆధునికీకరించిన మైదానాల్లో కార్మికులు శారీరకంగా, మానసిక ఉల్లాసాన్ని పొందుతున్నారు.

కార్మికుల ఆరోగ్యమే ప్రధానం



సింగరేణిలో బొగ్గు ఉత్పత్తితో పాటు కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నాం. సంస్థ భవితవ్యాన్ని నడిపించేది కార్మికులేనన్న సంగతి మరిచిపోలేం. తప్పకుండా వారు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం కోసం సంస్థపరంగా చర్యలు తీసుకుంటాం. భవిష్యత్తులో మాలను మరిన్ని చేపడతాం.

- జీఎం.ఎం.రాఘవులు, మందమర్రి ఏరియా

స్విమ్మింగ్ పూల్స్

కార్మికుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా కోల్ బెల్ట్ ప్రాంతాల్లో యాజమాన్యం ఈ మధ్య కాలంలో స్విమ్మింగ్ పూళ్ల నిర్మాణానికి చొరవ చూపుతోంది. గతంలో బెల్లంపల్లిలో మాత్రమే ఉండే స్విమ్మింగ్ పూళ్లు నేడు మందమర్రి, రామకృష్ణాపూర్ ప్రాంతాల్లోనూ ఏర్పాటయ్యాయి. మందమర్రిలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్‌లో వందలాది మంది కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకుంటున్నారు. రామకృష్ణాపూర్‌లో ఇటీవల అక్కడి ఆఫీసర్స్ క్లబ్ ప్రాంగణంలో అధికారులు స్విమ్మింగ్ పూల్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ స్విమ్మింగ్ పూల్‌ను సింగరేణి డైరెక్టర్(పా) ప్రారంభించారు.

నేటి నుంచి వెటరన్ అథ్లెటిక్స్



ముస్తాబైన ఠాగూర్ స్టేడియం



రన్నింగ్ ట్రాక్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం

- హాజరుకానున్న 600 మంది క్రీడాకారులు
- ముస్తాబైన రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియం

ఖేల్

రామకృష్ణాపూర్(చెన్నూర్): రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి వెటరన్ అథ్లెటిక్స్ పోటీలు గురు, శుక్రవారాల్లో జరగనున్నాయి. మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు ఠాగూర్ స్టేడియం సుందరంగా ముస్తాబైంది. గురువారం ఉదయం పది గంటలకు ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, ఎమ్మెల్సీ పురాణం సతీష్, కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ పోటీలను లాంఛనంగా ప్రారంభిస్తారు. ముందుగా క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్, గౌరవ వందనం కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం క్రీడాపతాకాన్ని ఆవిష్కరించి క్రీడలను ప్రారంభిస్తారు.

600 మంది క్రీడాకారులు

రాష్ట్రస్థాయి వెటరన్ అథ్లెటిక్స్ పోటీలలో రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. 100, 200, 400, 800, 1000 మీటర్లు, 5,10 కిలోమీటర్ల విభాగాల్లో పరుగు పందెం నిర్వహిస్తారు. అలాగే లాంగ్‌జంప్, హైజంప్, జావలీన్ త్రో, హ్యామర్‌త్రో, డిస్కస్‌త్రో, వాకింగ్ తదితర అంశాలలో పోటీలు ఉంటాయి. 40 నుంచి 90 సంవత్సరాలు వయసు విభాగాల్లో పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహిస్తారు.

ఏర్పాట్లు పూర్తి

ఆయా జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులకు పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల ఆవరణంలో బస ఏర్పాటు చేశారు. స్థానిక కమ్యూనిటీ హాల్, జీటీ హాస్టల్, రెస్క్యూ స్టేషన్, సింగరేణి క్వార్టర్లలో జట్లతో వచ్చిన కోచ్‌లు, మేనేజర్లకు ఏర్పాట్లు చేశారు. ఈ పోటీలను తిలకించేందుకు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు, కార్మికులు, క్రీడాభిమానులు భారీ సంఖ్యలో వచ్చే అవకాశముంది.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు నెన్నెల పీడీ



గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాలతో పీడీ గోపాల్

నెన్నెల(బెల్లంపల్లి): నెన్నెల ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సిరంగి గోపాల్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబర్ 29, 30న బెల్లంపల్లిలో జరిగిన మాస్టర్స్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో తొమ్మిది విభాగాల్లో పోటీలు నిర్వహించగా నాలుగు ఈవెంట్లలో ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్ అందుకున్నారు. షార్ట్‌పుట్‌లో స్వర్ణం, లాంగ్‌జంప్, డిస్కస్‌త్రో, జావెలింగ్ త్రోలలో రజత పతకాలను సాధించి చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. ఫిబ్రవరి 15 నుంచి 21 వరకు బెంగళూర్‌లో నిర్వహించే జాతీయ అథ్లెటిక్ పోటీలలో పాల్గొనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గోపాల్‌ను ఎంపీపీ గడ్డం కల్యాణి, జెడ్పీటీసీ కొడిపె భారతి, సర్పంచ్ ఆస్మా, ఎస్సై చందర్, ఎంఈఓ శ్రీధర్‌స్వామి, హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇల్లెందు ఏరియా ఆస్పత్రిని ఎత్తివేసేందుకు సింగరేణి యాజమాన్యం రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే వైద్యులతో కాల్ డ్యూటీలు చేయిస్తోంది. త్వరలో 21 ఇన్‌క్లైన్ భూగర్భ గని మూసివేత నేపథ్యంలో ఏరియా ఆస్పత్రికి ఎసరు పెట్టారని కార్మికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

- ☆ సింగరేణి దవాఖానాలో వైద్యులకు షిఫ్టులు రద్దు
- ☆ కాల్ డ్యూటీలతో రోగులకు చికిత్స
- ☆ ఆందోళనకు సన్నద్ధమవుతున్న కార్మిక సంఘాలు

ఇల్లెందు ఆస్పత్రి ఎత్తివేత?



ఇల్లెందు ఏరియా సింగరేణి వైద్యశాల

ఇల్లెందుఅర్బన్(భద్రాద్రి కొత్తగూడెం):

సింగరేణి ఇల్లెందు ఏరియా సింగరేణి వైద్యశాలను ఎత్తివేసేందుకు యాజమాన్యం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగానే వైద్యశాలలోని వైద్యులకు షిఫ్టుల రద్దు చేసి, కాల్ డ్యూటీ(షిఫ్టులవారీగా కాకుండా పిలిస్తే ఆస్పత్రికి వచ్చే సేవలందించడం)లను అమలు చేస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఇన్‌పేషంట్ల సంఖ్య తగ్గిపోయిందనే కారణంతో ఇటీవల వంటగదిని మూసివేశారు. ఇల్లెందు ఏరియా జేకేకాలనీ షుగర్ రోగులు ఏరియా వైద్యశాలకు రాకుండా జేకేకాలనీలో గల డిస్పెన్సరీలోనే ప్రత్యేక ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు చేపట్టారు. వైద్యశాలలో నలుగురు వైద్యులు, ఒక డీవైసీఎం పనిచేస్తున్నారు. అకస్మాతుగా యాజమాన్యం వైద్యశాలలో పలు మార్పులు చేయడంతో కార్మికులు పలు సందేహాలు నెలకొంటున్నాయి. 21 ఇన్‌క్లైన్ జీవిత కాలం ముగుస్తున్నందునే ముందస్తుగా ఏరియా వైద్యశాలను ఎత్తివేసేందుకు యాజమాన్యం శ్రీకారం చుట్టిందని కార్మికులు పేర్కొంటున్నారు. వైద్యశాల ఎత్తివేతపై పలు కార్మిక సంఘాల నేతలు దశలవారీ ఆందోళనలు చేపట్టేదుకు సన్నద్ధమవుతున్నారు.

వైద్యం అందని ద్రాక్షేనా..?

ఇల్లెందు ఏరియాలో సుమారు 1000 మంది కార్మికులు పని చేస్తున్నారు. దాదాపు 2వేలకు పైగా మాజీ గని కార్మిక కుటుంబాలు జీవిస్తున్నాయి. వైద్యశాలలో గుండె, చర్మ, చెవి, కంటి, ముక్కు, మూత్రపిండాలు తదితర వైద్య నిపుణులు లేకపోవడంతో కొంత మంది కార్మికులు ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు. గత ఐదు నెలల నుంచి వైద్యశాలలో ఇన్‌పేషెంట్ల సంఖ్య సుమారు 60 నుంచి 90 మంది మాత్రమే ఉంటున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. గైనకాలజిస్టు లేకపోవడంతో గర్భిణులను కొత్తగూడెం ఏరియా వైద్యశాలకు రెఫర్ చేస్తున్నారు. ఈ క్రమంలో వైద్యశాలను ఎత్తివేస్తే కార్మికులకు, మాజీ గని కార్మికులు వారి కుటుంబాలకుకంపెనీ వైద్యం అందని ద్రాక్షగా మారనుంది.

ఆందోళనలు నిర్వహిస్తాం



21 ఇన్‌క్లైన్ మూసివేతలో భాగంగానే యాజమాన్యం మొదటగా ఏరియా వైద్యశాలను ఎత్తివేసేందుకు చర్యలు చేపట్టింది. వైద్యశాలను పరిరక్షించుకునేందుకు దశవారీగా ఆందోళనలు నిర్వహిస్తాం. 21 ఇన్‌క్లైన్‌ను కాపాడుతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన గుర్తింపు సంఘం నేతలు.. ఏరియా వైద్యశాలను ఎత్తివేస్తుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారు?

– సారయ్య, ఏఐటీయూసీ నేత

ఎత్తివేతను అడ్డుకుంటాం



ఏరియా వైద్యశాలను ఎత్తివేతను యూనియన్ ద్వారా అడ్డుకుంటాం. గని గత ఏడాదిలోనే 21 ఇన్‌క్లైన్‌ను యాజమాన్యం మూసివేసేందుకు యత్నించగా మా యూనియన్ ద్వారానే అడ్డుకున్నాము. యాజమాన్యం గనిని మూసివేస్తే సహించేదిలేదు.

-లింగాల జగన్నాథం, టీబీజీకేఎస్ నేత

ఐక్యంగా పోరాడాలి



యాజమాన్యం ఏరియా వైదశాలను ఎత్తివేసేందుకు పూనుకుంది. వైద్యశాల అనంతరం క్రమక మంగా ఇతర శాఖలు కూడా మూసివేసేందుకు చర్యలు తీసుకుంటోంది. కార్మిక సంఘాలన్ని ఐక్యంగా పోరాడి వైద్యశాల ఎత్తివేతను అడ్డుకోవాలి.

-మీరా, సింగరేణి డ్రైవర్స్, ఈపీ ఆపరేటర్స్ సంఘం నేత

వైద్యశాల ఎత్తివేత అవాస్తవం



ఏరియా వైద్యశాలను ఎత్తివేయడం అవాస్తవం. ఇప్పటి వరకు యాజమాన్యానికి అలాంటి ఆలోచనే లేదు. వైద్యశాలకు వచ్చే ఇన్‌పేషెంట్ల సంఖ్య పూర్తిగా తగ్గిపోవడం వల్లనే యాజమాన్యం డాక్టర్లకు కాల్ డ్యూటీ, వంటగది మూసివేత తదితర చర్యలు చేపట్టింది. కార్మికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– కందుకూరి లక్ష్మీనారాయణ, ఏరియా జీఎం

ఎన్నికల హామీలు అమలు చేయాలి

ఏఐటీయూసీ అధ్యక్షుడు గట్టయ్య

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ముందు, తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వై గట్టయ్య, ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన యూనియన్ కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. హామీల అమలుకు పోరాటం చేయనున్నట్లు తెలిపారు. 10వ వేజ్ బోర్డ్ ఎరియర్స్ వెంటనే ఇవ్వాలని ఈ నెల 17న జీఎం కార్యాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. టీబీజీకేఎస్ గెలిచి మూడు నెలలు గడిచినా నేటికీ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. పదవీ విరమణ పొందిన కార్మికులకు సీఎంపీఎఫ్, పెన్షన్ ఆర్డర్ కాపీ, ఇతర టర్మినల్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యల పరిష్కారంలో ఏఐటయూసీ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ అదనపు కార్యదర్శి మిర్యాల రంగయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి దమ్మాలాపాటి శేషయ్య, నాయకులు నామ వెంకటేశ్వరరావు, బరిగెల సాయిలు, గుత్తుల సత్యనారాయణ, బందెల నర్సయ్య, వంగా వెంకట్, రాంగోపాల్, డి రాజారాం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గట్టయ్య

సేవా కోసం ప్రత్యేక వెబ్‌సైట్

కోల్‌బెల్ట్(భూపాలపల్లి జిల్లా): సింగరేణి సేవా సభ్యుల కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు భూపాలపల్లి ఏరియా సేవా అధ్యక్షురాలు పి క్రిష్ణవేణి కొండయ్య తెలిపారు. పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో బుధవారం సేవా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. పర్సనల్ మేనేజర్ డాక్టర్ రాజేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో సేవా అధ్యక్షురాలు క్రిష్ణవేణి కొండయ్య మాట్లాడుతూ సింగరేణి సంస్థ ప్రతి ఏటా సేవా ఆధ్వర్యంలో పలు రకాల సేవ, సామాజిక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రాజెక్టు ప్రభావిత గ్రామాలు, సమీప గ్రామాల యువత, మహిళల కోసం ప్రత్యేక వృత్తి శిక్షణ కార్యక్రమాలను చేపడుతున్నామని వెల్లడించారు. వారు తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు వెబ్‌సైట్ ప్రారంభించామన్నారు. బెల్లంపల్లిలో జరిగిన క్రీడల్లో భూపాలపల్లికి చెందిన సేవా సభ్యురాలు ప్రమీల బహుమతి సాధించటం పట్ల అభినందించారు. సేవా కో–ఆర్డినేటింగ్ ఆఫీసర్ మధార్‌సాహెబ్, ఎండీ మతీన్, సేవా కార్యదర్శి పుష్పలత, సహాయ కార్యదర్శి సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ వర్కర్ల నోటిఫికేషన్ రద్దు చేయాలి


జీఎం ఆనందరావుకు వినతి పత్రం అందజేస్తున్న ఆదివాసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం):

సింగరేణి యాజమాన్యం బదిలీ వర్కర్ల నోటిఫికేషన్ రద్దుచేసి, ఆ ఉద్యోగాలను ఆదివాసీలకే ఇవ్వాలని కోరుతూ సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట మంగళవారం తెలంగాణ ఆదివాసీ స్టూడెంట్స్ నిరుద్యోగ ఐక్యకార్యచరణ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం జీఎం (పర్సనల్) ఆనందరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇల్లెందు, మణుగూరు, ఆదిలాబాద్‌లలోని సుమారు 532 ఆదివాసీ భూ నిర్వాసిత కుటుంబాలకు జీఓ ఎంఎస్ నంబర్ 34 ద్వారా బదిలీవర్కర్లు ఉద్యోగాలు ఇస్తామని సింగరేణి అధికారులు హామీ ఇచ్చారని అన్నారు. 2014 నవంబర్‌లో జరిగిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో సమావేశంలో కూడా ఇందుకు ఒప్పుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేసి, ఆదివాసీలకే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ సంఘాల నాయకులు బట్ట రామకృష్ణ, కోడెం రామనాథం, కొమరం శంకర్, జోగ సంపత్, ముక్తి రామకృష్ణ, పద్దం శ్రీనివాస్, కొర్స శరత్‌బాబు, బంగారు రవి, పూసం సుధీర్, తుమ్మ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



వెండితెర



మంచిర్యాలలో..
శ్రీవెంకటేశ్వర– హలో
ఏషియన్ శ్రీనివాస – ఎంసీఏ, (మిడిల్ క్లాస్ అబ్బాయి)
లక్ష్మి – ఒక్క క్షణం
మయూరి – 2 కంట్రీస్
తిరుమల(స్క్రీన్–1)(సీసీసీ)– ఎంసీఏ, (మిడిల్ క్లాస్ అబ్బాయి)
దేవి(స్క్రీన్–2)(సీసీసీ) – హలో



గ్రామసభల నిర్వహణ

లక్సెట్టిపేట: మండలంలోని చందారం, బలరావుపేట గ్రామాల్లో అధికారులు బుదవారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామాల్లోని పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్మాణంపై వివరాల సేకరించారు. చందారం ఎంపీటీసీ అనుముల పద్మ, బలరావుపేట ఎంపీటీసీ సునీత, సర్పంచ్ శ్రీనివాస్, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, కార్యదర్శి నరేందర్ అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

మందకృష్ణను విడుదల చేయాలని వినతి

దండేపల్లి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను విడుదల చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ దత్తుప్రసాద్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు చేపట్టిన దీక్షను భగ్నం చేసి అరెస్టు చేయడాన్ని ఖండించారు. కార్యక్రమంలో కమిటీ మండల అధ్యక్షుడు తగరపు సత్యం, నాయకులు సతీశ్, ఎల్.బాపు, గంగరాం, వెంకటేశ్, సత్తయ్య, రాజయ్య, శ్రీనివాస్, లింగయ్య, కొండయ్య పాల్గొన్నారు.

జన్నారం: శాంతియుతంగా దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణను అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని వెంటనే మందకృష్ణను విడుదల చేయాలని కోరుతూ బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ మనోహర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు పూర్ణపు రాజరాం, సత్యం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అఖిల పక్షాన్ని ఢిల్లీకి పంపి పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు అమోదింపజేయాలని డిమాండ్ చేస్తూ పలు కార్యక్రమాలు చేపట్టిన పట్టింపులేకుండా ఉందన్నారు. శాంతియుతంగా పోరాటం చేసిన ప్రభుత్వం కుట్రపన్ని భగ్నం చేపిస్తుందని ఆరోపించారు. ఇలాగే కొనసాగితే మాదిగల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సుగుణ, గంగన్న తదితరులు పాల్గొన్నారు.



దండేపల్లి: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉపాధి సిబ్బంది లక్ష్యాన్ని చేరుకోవాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం నస్పూర్, హాజీపూర్ మండలాల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి మంచిర్యాల ఎంపీడీవో అబ్దుల్‌హై అధ్యక్షత వహించగా ఎంపీపీ బేర సత్యనారాయణ, ఈజీఎస్ పీడీ మల్లేశ్, ఈఓపీఆర్‌డీ శంకర్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది హాజరయ్యారు. ఈజీఎస్ పథకంలో చేపట్టాల్సిన కిచెన్ షెడ్స్, ఎస్‌బీఎం మరుగుతొడ్లు, పాఠశాల మరుగుదొడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని తెలిపారు. సమావేశంలో మండల విద్యాధికారి దాసరి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు శ్రీపతి బాపురావు, సప్దర్‌అలీ, అజ్మత్‌అలీ, సమ్మిరెడ్డి, సత్యనారా యణ, శ్రీనివాస్, చంద్రకళ, సర్పంచులు డేగ బాపు, దుర్గం లక్ష్మి, జాడి సత్యం, సీపెల్లి లక్ష్మి, కోవ రాజు, జగన్నాథుల లింగయ్య, గడ్డం స్వామిరెడ్డి, ఈజీఎస్ టీఏ లు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో అబ్దుల్‌హై

సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

మంచిర్యాలటౌన్: భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అడుగుజాడల్లోనే అందరూ నడవాలని, అందరికి ఆదర్శంగా నిలవాలని మంచిర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ మామిడిశెట్టి వసుంధర అన్నారు. సాయిత్రిబా యి 187వ జయంతి వేడుకలను బుధవారం మంచిర్యాల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని సీవీ రామన్ డిగ్రీ కళాశాలలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నల్ల శంకర్, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, సంఘర్షణ సమితి అధ్యక్షురాలు బద్రి సాహితి పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వసుంధర

సాహు మహారాజ్ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో...

ఛత్రపతి సాహు మహరాజ్ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సమక్షంలో జయంతి ఘనంగా నిర్వహించారు. సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆరె శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చిట్యాల విక్రమ్, సాహు స్టడీ సర్కి ల్ డైరక్టర్ కుడుదుల శ్రీనివాస్, బొలిశెట్టి నాగేంద్ర, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

స్కీం వర్కర్లతో వెట్టిచాకిరీ

మంచిర్యాలక్రైం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీం వర్కర్లతో వెట్టిచాకిరీ చేయించుకుంటుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ఎస్. రమ అన్నారు. మంచిర్యాల పట్టణంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం జనవరి 17న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ప్రకా శ్, సంకే రవి, సీఐటీయూ నాయకులు శ్రీపతి రావు, రాజారాం, అజీజ్, మధ్యాహ్న బోజన వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి, ఐకేపీ, వీవోఏవో సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమ

జోన్‌గైడ్

నేడు మండల సర్వసభ్య సమావేశం

దండేపల్లి: మండల సర్వసభ్య సమావేశాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు.

10న దుకాణాలకు వేలం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల గోదావరి నదీతీరాన నిర్వహించే సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసే దుకాణాలు, వాహనాల పార్కింగ్‌కు సంబంధించి వేలం ఈనెల 10న నిర్వహిస్తున్నట్లు జాతర ఈవో వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అసక్తిగల వారు లీజు హక్కులు పొందేందుకు డిపాజిట్‌తో రావాలని సూచించారు. వివరాలకు 9849809678 ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

ఐటీఐ కళాశాల భవనం నిర్మించాలని వినతి

జన్నారం: మండలకేంద్రంలోని ఐటీఐ కళాశాల భవనానికి పక్కా భవనం నిర్మించాలని కోరుతూ బుధవారం ఎన్‌టీఎస్ఎఫ్ ఆధ్వర్యలో తహసీల్దార్ మనోహర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌టీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాంప్రసాద్ మాట్లాడుతూ సంవత్సరాల కాలంగా పక్కా భవనం లేక అరకొర వసతుల మధ్య ఐటీఐ విద్య కొనసాగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిధులు విడుదలైనా నిర్మించడంలో అధికారుల జాప్యం తగదన్నారు. వెంటనే అధికారులు స్పందించి భవన నిర్మాణం ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌టీఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు వినయ్‌కుమార్, మండల అధ్యక్షుడు నీరటి రాకేశ్, నాయకులు పాల్గొన్నారు.

గూడెం హుండీ లెక్కింపు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయానికి పుష్య పౌర్ణమి జాతర ద్వారా వచ్చిన ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మొత్తం రూ.2,45,875 ఆదాయం వచ్చింది. ఇందులో హుండీ ద్వారా రూ. 1,32,016, రశీదులు ఇతరముల ద్వారా రూ.1,13,859 వచ్చాయి..దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్ గౌడ్ పర్యవేక్షణలో చేపట్టిన ఈ లెక్కింపులో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు, ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటస్వామి, ఈవో నారాయణ, ధర్మకర్త మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, సత్యనారాయణ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ట్రాఫిక్ సీఐ

మంచిర్యాలక్రైం: మంచిర్యాల ట్రాఫిక్ సీఐగా సతీశ్ బుధవారం బాధ్యతలు స్వీకరిచారు. ఇంతకు ముందు మందమర్రి, మంచిర్యాల టాస్క్‌ఫోర్స్, ఎస్‌బీ ఎస్సైగా మంచిర్యాలలోనే పనిచేశారు. ఇటీవల పోలీస్ శాఖలో భారీగా ఎస్సైలకు సీఐగా పదోన్నతుల్లో భాగంగా సతీశ్‌కు సీఐగా పదోన్నతి లభించింది. అనంతరం మంచిర్యాల ట్రాఫిక్ సీఐగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేస్తానని అన్నారు. వాహనదారులు, పట్టణ ప్రజలు, వ్యాపారులు సహకరించాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించరాదన్నారు.

'ఉమ్మెత్త'ను జంతువులు ఎందుకు తినవు?



పి. నీలకంఠయ్య
స్కూల్ అసిస్టెంట్




విసర్జన - వ్యర్థాల తొలగింపు వ్యవస్థ

సజీవుల మనుగడకు, వివిధ జీవక్రియల నిర్వహణకు శక్తి అవసరం. జీవులన్నీ జీవక్రియల నిర్వహణలో వివిధ రకాల పదార్థాలను ఉపయోగిస్తాయి. ఫలితంగా అనేక రకాల పదార్థాలు ఉత్పన్నమవుతాయి. వీటిలో హాని చేసే పదార్థాలను విసర్జించి, కొన్నింటిని వేరే రూపంలోకి మార్చుకుని నిల్వచేసుకుంటాయి. విసర్జన.. సజీవుల్లో జరిగే ఒక జీవక్రియ.

మన శరీరంలో ఉత్పన్నమయ్యే కార్బన్ డై ఆక్సైడ్, నత్రజని సంబంధిత వ్యర్థాలైన అమ్మోనియా, యూరియా, యూరికామ్లం, పైత్యరస వర్ణకాలు, అదనపు లవణాలు ఉంటాయి. కాబట్టి వీటిని శరీరం బయటికి విసర్జించాలి.

మానవ విసర్జక వ్యవస్థ

మానవుడిలో ఒక జత మూత్రపిండాలు, మూత్ర నాళాలు, మూత్రాశయం ఉంటాయి. మూత్రపిండం చిక్కుడుగింజ ఆకారంలో, ముదురు ఎరుపు రంగులో ఉంటుంది. ఉదర కుహరంలో పృష్టశరీర కుడ్యానికి మూత్రపిండాలు అతుక్కుని వెన్నెముకకు ఇరువైపులా అమరి ఉంటాయి.



విసర్జన వ్యవస్థ


మూత్రపిండంలో పుటాకారంగా ఉన్న లోపలితలం మధ్యలోని పల్లాన్ని 'హైలస్' అంటారు. దీనిద్వారా వృక్కధమని మూత్రపిండంలోకి, వృక్కసిర మూత్రనాళం వెలుపలికి వస్తాయి. అంతర్నిర్మాణంలో ముదురు గోధుమ వర్ణంలో ఉన్న వెలుపలి భాగాన్ని 'వల్కలం'అని, లేత గోధుమ వర్ణంలో ఉన్న లోపలి భాగాన్ని 'దవ్వ' అని అంటారు. ప్రతీ మూత్రపిండంలో 1మిలియన్ కంటే ఎక్కువ నెఫ్రాన్‌లు ఉంటాయి.

ప్రతి నెఫ్రాన్‌లోనూ మాల్ఫీజియన్ దేహం, వృక్కనాళిక ఉంటాయి. మాల్ఫీజియన్ దేహంలో రక్తకేశనాళికలు గుచ్ఛంలా ఏర్పడి ఉంటాయి. దీన్ని 'గ్లామెరూలస్' అంటారు. గ్లామెరూలస్‌లో అభివాహి ధమనిక వ్యాసం.. అపవాహిధమనిక వ్యాసం కంటే ఎక్కువగా ఉంటాయి. దీంతో గుచ్ఛంలో పీడనం పెరిగి దానిలోని పదార్థాలు వడపోతకు గురవుతాయి. వృక్కనాళికలో సమీపస్థ సంవళితనాళం, హెన్లీశిక్యం, దూరస్థ సంవళిత నాళాలు ఉంటాయి. వృక్కనాళిక సంగ్రహణ నాళం ద్వారా చివరికి ద్రోణిలోకి తెరుచుకుంటుంది.

మూత్రం ఏర్పడే విధానం

మూత్రాశయంలో 700-800 మి.లీ. మూత్రం నిల్వ ఉంటుంది. మానవుడు రోజుకు సుమారు 1.6-1.8 లీటర్ల మూత్రాన్ని విసర్జిస్తాడు.

మూత్రం లేత పసుపురంగు ద్రవం. రక్తంలోని



మూత్రం తయారీ విధానం

హిమోగ్లోబిన్ విచ్ఛిన్నమైనప్పుడు ఏర్పడే యూరోక్రోమ్ అనే పదార్థం ఈ రంగుకు కారణం. అదే విధంగా మూత్రంలో 96శాతం నీరు, 2.5శాతం కర్బన పదార్థాలు (యూరియా, యూరిక్ ఆమ్లం, క్రియాటిన్ మొదలైనవి) ఉంటాయి.

మూత్రపిండాలు పనిచేయకపోవడం

వివిధ కారణాల వల్ల మూత్రపిండాలు పనిచేయడం ఆగిపోతే శరీరంలో నీరు, వ్యర్థ పదార్థాలు నిండిపోతాయి. ఈ దశను 'యురేమియ' అంటారు. ఫలితంగా కాళ్లు, చేతులు ఉబ్బుతాయి. దీనికి పరిష్కారంగా డయాలసిస్ యంత్రంతో రక్తాన్ని వడకడతారు. దీన్నే 'హిమోడయాలసిస్' అని అంటారు. ఈ సమస్య దీర్ఘకాలిక పరిష్కారం కోసం మూత్రపిండ మార్పిడి చేస్తారు. దాతల నుంచి అవయవాలను సేకరించి అమరుస్తారు. మానవుడిలో ఊపిరితిత్తులు, చర్మం, కాలేయం అనుబంధ విసర్జకాంగాలు.

మొక్కలు కూడా విసర్జనను జరుపుకొంటాయి. వీటిలో ప్రత్యేకమైన అవయవాలు లేవు. వ్యర్థాలు ఏర్పడే ప్రక్రియ మొక్కల్లో చాలా నెమ్మదిగా జరుగుతుంది. బాష్పోత్సేకం, బిందుస్రావం వ్యర్థాలను పండ్లల్లో రాఫైడ్‌లుగా నిల్వ చేసి మొక్కలు బయటికి పంపుతాయి. పిండిపదార్థాలు, ప్రొటీన్‌లు, కొవ్వులు అనేవి ప్రాథమిక జీవక్రియోత్పన్నాలు. ఆల్కలాయిడ్‌లు, టానిన్‌లు, రెసిన్‌లు, జిగురులు, లేటెక్స్ మొదలైనవి ద్వితీయ జీవక్రియోత్పన్నాలు. ఇవి ఆర్థిక ప్రాధాన్యం కలవి.

గుర్తుంచుకోవాల్సిన అంశాలు

1. మూత్రపిండ అంతర్నిర్మాణం
2. నెఫ్రాన్ నిర్మాణం
3. మూత్రం ఏర్పడే విధానం
4. హిమోడయాలసిస్
5. వివిధ జీవుల్లో విసర్జక వ్యవస్థ
6. ఆల్కలాయిడ్‌లు
7. మూత్రపిండం అధ్యయనం-ప్రయోగశాల కృత్యం

ముఖ్య ప్రశ్నలు-జవాబులు

1. మొక్కల్లో తయారయ్యే పదార్థాలను ప్రాథమిక జీవక్రియోత్పన్నాలు, ద్వితీయ జీవక్రియోత్పన్నాలుగా వర్గీకరిస్తారు. ఈ రెండింటికీ ఒక్కో ఉదాహరణ రాయండి.

జ. **ప్రాథమిక జీవక్రియోత్పన్నాలు.**
ఉదా: పిండిపదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వులు.
ద్వితీయ జీవక్రియోత్పన్నాలు:
ఉదా: ఆల్కలాయిడ్‌లు, రెసిన్‌లు, టానిన్‌లు, జిగుర్లు, లేటెక్స్.

2. జంతువుల నుంచి రక్షించుకోవడానికి మొక్కలు అనుసరించే విధానాలను మీ గ్రామంలో ఉన్న రెండు మొక్కలను ఉదాహరణగా తీసుకుని వివరించండి.

జ. **ఉమ్మెత్త:** ఈ మొక్కలో 'స్కోపాలమైన్' అనే ఆల్కలాయిడ్ విషపూరితంగా ఉండటం వల్ల వీటిని జంతువులు తినవు.
అత్తిపత్తి: తాకిన వెంటనే ఇవి ముడుచుకుంటాయి. తమనుతాము రక్షించుకుంటాయి.

3. మానవ శరీరంలో మూత్రపిండం ఒక ముఖ్యమైన విసర్జకావయవం. మానవుడిలో విసర్జన క్రియను అదనపు విధిగా నిర్వహించే అవయవాలు, అవి విసర్జించే పదార్థాల పేర్లు రాయండి.

జ. ***అనుబంధ విసర్జకావయవాలు***
i) ***ఊపిరితిత్తులు:*** CO_2, నీటి ఆవిరి
ii) ***చర్మం:*** లవణాలు అధికంగా ఉన్న నీటిని చెమట రూపంలో విసర్జిస్తుంది
iii) ***కాలేయం:*** యూరోక్రోమ్, పైత్యరస వ్యర్థాలు
iv) ***పెద్దపేగు:*** కాల్షియం, మెగ్నీషియం, ఐరన్‌ల లవణాలు

4. మూత్రపిండాన్ని విచ్ఛిన్నం చేసి, అందులోని భాగాలను మీరు పరిశీలించారు కదా, అయితే ఈ ప్రయోగం ఎలా నిర్వహించాలో వివరించండి.


జ. మూత్రపిండం బాహ్య, అంతర లక్షణాలను తెలుసుకోవడానికి మూత్రపిండాన్ని విచ్ఛిన్నం చేసి కింది విధంగా పరిశీలించాను.
కావాల్సిన పదార్థాలు: మాంసం కొట్టులో సేకరించిన మేక లేదా గొర్రె మూత్రపిండం లేదా మూత్రపిండ త్రీడీ నమూనా, పదునైన బ్లేడ్, ట్రే, నీరు.


మూత్రపిండం నిలువుకోత

పరిశీలనా విధానం:
i) మేక లేదా గొర్రె మూత్రపిండాన్ని సేకరించి, రక్తమంతా పోయేలా నీటితో శుభ్రంగా కడిగాను.
ii) పూర్తిగా ఆరిన తర్వాత దాన్ని ఒక ట్రేలో ఉంచి జాగ్రత్తగా పరిశీలించి, నోట్‌బుక్‌లో పరిశీలనలు నమోదు చేశాను.
iii) ఒక పదునైన బ్లేడు లేదా స్కాల్‌పెల్ సాయంతో మూత్రపిండాన్ని నిలువుగా కట్ చేసి, అంతర్గత నిర్మాణాన్ని పరిశీలించాను.

ఫలితాలు:
i) మూత్రపిండాలు చిక్కుడుగింజ ఆకారంలో ఉన్నాయి.
ii) ముదురు ఎరుపు రంగులో ఉన్నాయి.
iii) మూత్రపిండంపై గ్రంథుల్లాంటి నిర్మాణాలు అతుక్కుని ఉన్నాయి.
iv) హైలస్ ద్వారా వృక్కధమని లోనికి ప్రవేశిస్తుంది. వృక్కసిర, మూత్రనాళం వెలుపలికి వస్తాయి.

5. విసర్జక వ్యవస్థలో నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణమని దేన్ని పేర్కొంటారు. దాని బొమ్మ గీసి భాగాలు గుర్తించండి. అభివాహి ధమనిక వ్యాసం, అపవాహి ధమనిక వ్యాసం కంటే ఎక్కువ ఉండటానికి కారణం ఏమిటి?



నెఫ్రాన్ నిర్మాణం

జ. విసర్జక వ్యవస్థలో నెఫ్రాన్‌ను నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం అంటారు. అభివాహి ధమనిక వ్యాసం, అపవాహి ధమనిక వ్యాసం కంటే ఎక్కువ ఉండటానికి కారణం గ్లామెరూలస్‌లో పీడనం పెరిగి, దానిలోని పదార్థాలు వడపోతకు గురవుతాయి.

6. కింది చిత్రాల్లో ఉన్న జీవుల్లోని విసర్జక వ్యవస్థలను పట్టిక రూపంలో రాయండి


A


B


C


D

జ.

జీవిపేరు / వర్గం	విసర్జక వ్యవస్థ
ప్రోటోజోవా	కణం ఉపరితలం నుంచి వ్యాపనం ద్వారా
అనెలిడా	నెఫ్రీడియా
ఆర్థ్రోపొడ	హరిత గ్రంథులు, మాల్ఫీజియన్ నాళికలు
మానవుడు	మూత్రపిండాలు

‘పరభాష ద్వారా బోధన అంటే సోపానాలు లేని సౌధం’



డాక్టర్ పి.వి.సుబ్బారావు
సబ్జెక్టు నిపుణులు

తెలుగు మెథడాలజీ

టీఎస్‌పీఎస్సీ
టీఆర్‌టీ
ఎస్‌జీటీ - తెలుగు
ప్రత్యేకం

తెలుగు స్కూల్ అసిస్టెంట్స్ (ఎస్ఏ), లాంగ్వేజ్ పండిట్స్ (ఎల్‌పీ)కి మెథడాలజీ (బోధనాశాస్త్రం) కీలకమైంది. పరీక్షలో ఎక్కువ మార్కులు సాధించాలంటే ప్రణాళికాబద్ధంగా చదవాలి. తెలుగు కంటెంట్ కంటే మెథడాలజీ కష్టమైన అంశం. ఈ సిలబస్‌లో ఆరు అధ్యాయాలు ఉన్నాయి. వాటిని ఏ విధంగా చదవాలి అనే అంశాన్ని విశ్లేషణాత్మకంగా పరిశీలిద్దాం.

1. భాష-వివిధ భావనలు

ఇది సుదీర్ఘమైన అధ్యాయం. దీనిలో అతి ముఖ్యమైన అంశం ప్రథమ భాషగా తెలుగు బోధనోద్దేశాలు, లక్ష్యాలు, స్పష్టీకరణలతోపాటు కనీస అభ్యసన స్థాయికి సంబంధించిన అంశాలు చదవాలి. ద్వితీయ భాషగా తెలుగును ఎలా బోధించాలో శ్రద్ధగా చదవాలి. ఈ అధ్యాయం నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంటుంది.

ఉదా: స్వతస్సిద్ధ వాదాన్ని ప్రతిపాదించిన భాషావేత్త ఎవరు?
1) యాస్కాచార్యుడు
2) మాక్స్ ముల్లర్
3) నోమ్ చామ్‌స్కీ 4) బి.ఎఫ్. స్కిన్నర్

సమాధానం: (3) నోమ్ చామ్‌స్కీ

ఉదా: తెలుగును ద్వితీయ భాషగా బోధిస్తున్నప్పుడు మొదట సాధించాల్సిన విలువలు ఏవి?
1) అగణిత విలువలు
2) హృదయ గత విలువలు
3) పరిమిత విలువలు
4) పరోక్ష విలువలు

సమాధానం: (3) పరిమిత విలువులు

2. భాషా నైపుణ్యాలు

ఈ అధ్యాయంలో వ్యక్తిత్వ వికాస సోపానాలైన శ్రవణం, భాషణం, పఠనం, లేఖనం అనే నాలుగు నైపుణ్యాలను శ్రద్ధగా చదవాలి. వీటి అంతర్గత సంబంధాలను ప్రత్యేకంగా పరిశీలించాలి. దీనిలో ‘భాషణం’లో భాగంగా వాగుత్పత్తి, వాగింద్రియ నిర్మాణం, వర్ణోచ్చారణ స్థానాలు (స్థాన-కరణ, ప్రయత్నాలు), వాటి నివారణోపాయాలను చదవాలి.

3. ప్రణాళిక రచన-పాఠ్యగ్రంథాలు

ఈ అధ్యాయాన్ని రెండు భాగాలుగా వర్గీకరించి చదవాలి. మొదటి భాగంలో ‘విద్యా ప్రణాళిక, మౌలిక విద్యా ప్రణాళిక, పాఠ్య విషయ ప్రణాళిక, వార్షిక ప్రణాళిక, యూనిట్ ప్రణాళికతో పాటు పాఠ్యభాగ పథకాన్ని చదవాలి. రెండో భాగంలో పాఠ్య పుస్తకాలైన ప్రధాన వాచకం, నిర్మాణ సూత్రాలు, పాఠ్య పుస్తకాల జాతీయీకరణ, ఉపవాచకం, కృషి పుస్తకం, (Workbook), ఆధ్యాత్మిక దర్శిని లాంటి అంశాలను శ్రద్ధతో అధ్యయనం చేయాలి. ఈ అధ్యాయం నుంచి పాఠ్యాంశాల అన్వయ ప్రశ్నలు అడిగే అవకాశం తక్కువగా ఉంటుంది.

4. విద్యా సాంకేతిక శాస్త్రం-సహ పాఠ్య కార్యక్రమాలు

ఈ అధ్యాయాన్ని రెండు భాగాలుగా విభజించి చదవాలి. మొదటి భాగంలో బోధనోపకరణాల్లో రకాలైన శ్రవ్య, దృశ్యం, దృశ్య-శ్రవ్య బోధనోపకరణాలను పరిశీలనా దృష్టితో చదవాలి. కొన్నిసార్లు ఈ విభాగం నుంచి అత్యంత కఠినమైన ప్రశ్నలు అడుగుతుంటారు.

రెండో భాగమైన సహ పాఠ్య కార్యక్రమాల్లో భాగంగా భాషా క్రీడలు, వక్తృత్వం, ఉక్త రచన, వ్యాస రచన, పత్రిక నిర్వహణ, భాషా విహార యాత్రలు, సారస్వత సంఘాలు, గ్రంథాలు, పఠనాలయాలు, పరామర్శ గ్రంథాలు, మూల గ్రంథాలకు సంబంధించిన అంశాల గురించి స్థూలమైన అవగాహనతో చదవాలి.

5. సాహిత్య ప్రక్రియలు-బోధనా పద్ధతులు

ఇది మెథడాలజీ సిలబస్‌లో కీలకమైన అధ్యాయం. విస్తృతమైంది. ఎక్కువగా అన్వయ ప్రశ్నలకు అవకాశం ఉన్న అధ్యాయమిది. ఇందులో పద్య బోధన, గద్యబోధన, వ్యాకరణ బోధన, ఉపవాచక బోధన, కథా బోధన, నాటక బోధనలకు సంబంధించి క్షుణ్నంగా అధ్యయనం చేయాలి.

ఆధునిక ధోరణులైన క్రీడా, కిండర్ గార్టెన్, మాంటిస్సోరి, ప్రాజెక్టు, డాల్టన్, కృత్యాధార, నాటకీకరణ పద్ధతులను సూక్ష్మదృష్టితో చదవాలి. ఇందులో భాగంగా కార్యక్రమయుత బోధన, బృంద బోధన, సూక్ష్మ బోధనల గురించి అధ్యయనం చేయాలి. వీటిపై అన్వయాత్మక ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ఈ అధ్యాయం నుంచి ఎక్కువ ప్రశ్నలు రావడానికి వీలుంది.

6. మూల్యాంకనం

ఒక పనిని పూర్తి చేసిన తర్వాత అది ఎంతమేరకు ఫలప్రదమైందో తెలుసుకునేందుకు దోహదపడే అంశం మూల్యాంకనం (Evaluation). ఇందులో నికష, పరీక్ష, పరిగణన, మదింపు, మూల్యాంకనం అనే భావనలు, వాటి తారతమ్యాల గురించి సూక్ష్మ దృష్టితో చదవాలి.

నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ)లో భాగంగా నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాలను అధ్యయనం చేయాలి. వ్యాసరూప, లఘూత్తర, అతి లఘూత్తర, లక్ష్యాత్మక ప్రశ్నలపై దృష్టి సారించాలి.

పాటించాల్సిన సూచనలు

- ఆరు అధ్యాయాల సిలబస్‌లో 1, 5 అధ్యాయాలు కీలకమైనవి. వీటి నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.
- గత డీఎస్సీ, టెట్ ప్రశ్నాపత్రాల్లోని మెథడాలజీ ప్రశ్నలను చదవాలి.
- మెథడాలజీ నుంచి డీఎస్సీకి 32 ప్రశ్నలు వస్తాయి. వాటికి 16 మార్కులు. టెట్‌కు 6 ప్రశ్నలుంటాయి. వాటికి 6 మార్కులు. సిలబస్ దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకించి నోట్స్ తయారు చేసుకోవాలి.
- తెలుగు అకాడమీ డీఎడ్, బీఎడ్ మెథడాలజీ గ్రంథాలు చదవాలి.
- కంటెంట్‌తో అనుసంధానం చేసుకుంటూ మెథడాలజీని చదవాలి.
- పాఠ్య పుస్తక నిర్మాణ సూత్రాలను చదివేటప్పుడు పాఠ్య పుస్తక ఇతివృత్తాలతో అనుసంధానం చేసుకోవాలి.
- ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా ప్రమాణాలు, సామర్థ్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
- మూల్యాంకనంలో వస్తున్న నిత్యనూతన మార్పులను అవగాహన చేసుకుని చదవాలి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. వక్తృత్వ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో పెంపొందే నైపుణ్యం ఏది? *(టెట్-2014)*
1) శ్రవణం 2) భాషణం
3) పఠనం 4) లేఖనం

2. భాషా ఉద్దేశాలు ఆరంభాలైతే, అంత్య ఫలితాలు ఏవి? *(టెట్-2012)*
1) ప్రయోజనాలు 2) పఠన పాటవాలు
3) అభ్యసనం 4) అనువర్తనాలు

3. వాచిక చర్యకు ముఖ్య ఆధారం? *(టెట్-2012)*
1) అభిప్రాయావళి 2) వైఖరీ నికష
3) పరిపృచ్ఛ 4) ప్రశ్నావళి

4. సాధారణంగా ఉక్త లేఖనాంశాన్ని మూడు సార్లు చెప్పాలి. అలా మొదటిసారి చెప్పినప్పుడు విద్యార్థి చేయవలసింది ఏది? *(టెట్-2011)*
1) తప్పులు సరిచూసుకోవాలి
2) ఏకాగ్రతతో వినాలి
3) వినాలి - రాయాలి 4) రాయాలి

5. పఠన లేఖనాంశాల్లో పఠనాన్ని ‘స్తబ్దాంశం’ అంటారు. మరి లేఖనాన్ని ఏమంటారు? *(టెట్-2011)*
1) ప్రేరణాంశం 2) శబ్దాంశం
3) కారకాంశం 4) లక్షణాంశం

6. తరగతి గదిలో విద్యార్థుల శ్రవణ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఉపాధ్యాయుడు దృషిసారించాల్సిన ఒక అంశం ఏది? *(టెట్-2012)*
1) క్షుణ్నంగా పఠనం చేయాలి
2) కఠిన పదాలను పరిచయం చేయడం
3) పాఠాలను బాహ్యంగా చదివించడం
4) పాఠాలను మౌనంగా చదివించడం

7. ‘ధ్వని, భావం మధ్య అనురూపమైన సంబంధం ఉంటుందని, ప్రకృతి అంతా లయాత్మకమని, ప్రతి పదార్థం ప్రకంపనలను కలిగి ఉంటుందని, ఆ ప్రకంపనలకు అనుగుణంగానే వక్త నోట శబ్దాలు వెలువడుతాయి’ అని చెప్పే వాదం ఏది? *(టెట్-2012)*
1) బౌ-వౌ వాదం
2) డింగ్‌డాంగ్ వాదం
3) ధాతు వాదం 4) స్వతస్సిద్ధ వాదం

8. శిక్షణ బదలాయింపు సూత్రాన్ని అనుసరించి ప్రధాన వాచక అధ్యయనం దేనికి తోడ్పడుతుంది? *(టెట్-2012)*
1) భాషా లక్ష్యాల సాధన ద్వారా విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడం
2) మాతృభాష ద్వారా సాధించిన భాషా నైపుణ్యాలను ఇతర భాషల అధ్యయనానికి వినియోగించడం
3) భాషా నైపుణ్యాల అభివృద్ధి ద్వారా భాషా లక్ష్యాలను సాధించడం
4) భాషాభిరుచిని పెంపొందించడం ద్వారా విరామ కాలాన్ని సద్వినియోగం చేయడం

9. ‘భాషకు మూలం కొన్ని ధాతువులే’ అని ప్రతిపాదించినవారు?
1) గార్గి 2) ఎలెన్ గార్డినర్
3) యాస్కాచార్యుడు 4) కాత్యాయనుడు

సమాధానాలు

1) 2	2) 1	3) 4	4) 2	5) 3
6) 1	7) 2	8) 2	9) 3	

మాదిరి ప్రశ్నలు

1. భాషను ‘మేధస్సు ప్రసరించే కాంతి’గా వర్ణించిన భాషావేత్త ఎవరు?
1) బెంజిమెన్ వార్ఫ్
2) ఎడ్వర్డ్ సఫైర్ 3) జాన్ స్టువర్ట్‌మిల్
4) ప్రొఫెసర్ విట్నీ

2. భాషను ‘బహుముఖ వ్యవస్థ’గా వర్ణించిన వారెవరు?
1) ఎడ్వర్డ్ సఫైర్ 2) ఫిర్త్
3) విలియం జేమ్స్ 4) హాకెట్

3. ‘ఉన్నత సంక్లిష్ట సూత్రజాలావలయం భాష’ అని ఏ గ్రంథంలో పేర్కొన్నారు?
1) లింగ్విస్టిక్ చేంజ్
2) మోడరన్ లింగ్విస్టిక్స్
3) లాంగ్వేజ్ ఈజ్ ది మోడరన్ వరల్డ్
4) ది సైన్స్ ఆఫ్ లాంగ్వేజ్

4. ‘ఏ గూటి చిలుక ఆ గూటి పలుకులు పలుకుతుంది’ అని తెలిపే భాషావాదం ఏది?
1) యోహెహో వాదం
2) డింగ్‌డాంగ్ వాదం
3) స్వతస్సిద్ధ వాదం 4) అనుభవ వాదం

5. ఆధునిక భాషా శాస్త్రవేత్తలు సైతం అంగీకరిస్తున్న భాషోత్పత్తివాదం ఏది?
1) భగవద్దత్త వాదం
2) ధాతు వాదం 3) ప్రకంపనా వాదం
4) టట్‌టట్ వాదం

6. ‘డింగ్‌డాంగ్ వాదానికి’ మరో పేరు?
1) పూపూ వాదం 2) స్వతస్సిద్ధ వాదం
3) ప్రకంపనా వాదం
4) సంపాదనా వాదం

7. కింది వాటిలో సరికానిది ఏది?
1) డింగ్‌డాంగ్ వాదం - మాక్స్ ముల్లర్
2) ధాతు వాదం - యాస్కాచార్యుడు
3) స్వతస్సిద్ధ వాదం - లిబ్నిజ్
4) పూపూ వాదం - కొండెకల్

8. ‘మాతృభాష తల్లి పాలలాంటింది. పరభాష దాది పాలలాంటిది’ అని పేర్కొన్న వారెవరు?
1) మహాత్మాగాంధీ
2) కొమర్రాజు లక్ష్మణరావు
3) రవీంద్రనాథ్ ఠాగూర్
4) గొడవర్తి సూర్యనారాయణ

9. ‘పరభాష ద్వారా బోధన అంటే సోపానాలు లేని సౌధంలాంటింది’ అని తెలిపిన వారెవరు?
1) రైబర్న్
2) వావిలాల గోపాలకృష్ణయ్య
3) రవీంద్రనాథ్ ఠాగూర్
4) గొడవర్తి సూర్యనారాయణ

10. మాతృభాషకు ఉన్న పేర్లు?
1) ప్రాంతీయ భాష
2) దేశీయ భాష - స్థానిక భాష
3) ప్రథమ భాష - అధికార భాష
4) పైవన్నీ

11. ‘శిశువు సౌందర్య దృష్టినీ, ఆనందానుభూతినీ వ్యక్తం చేయడానికి ఉపయోగపడేది మాతృభాష’ అని నిర్వచించినవారు?
1) మహాత్మా గాంధీ
2) వావిలాల గోపాలకృష్ణయ్య
3) గొడవర్తి సూర్యనారాయణ
4) రైబర్న్

12. ప్రాంతీయ భాషలను అధికార భాషలుగా స్వీకరించడానికి ఆయా రాష్ట్రాలకు అధికారం కల్పించిన రాజ్యాంగ అధికరణ ఏది?
1) 342 2) 345
3) 343 4) 346

13. అధికార భాషా సంఘం ఏ తేదీన ఏర్పడింది?
1) 1968 మార్చి 19
2) 1966 మార్చి 19
3) 1964 ఏప్రిల్ 10
4) 1966 ఏప్రిల్ 1

14. అధికార భాషా సంఘం తొలి అధ్యక్షుడు ఎవరు?
1) అయ్యదేవర కాళేశ్వరరావు
2) వావిలాల గోపాల కృష్ణయ్య
3) వందేమాతరం రామచంద్రరావు
4) నండూరి రామకృష్ణమాచార్యులు

15. కింది వారిలో అధికార భాషా సంఘం అధ్యక్షుడు కాని వారెవరు?
1) ఆచార్య పి. యశోదారెడ్డి
2) ఆచార్య సి. నారాయణరెడ్డి
3) ఆచార్య నాయని కృష్ణకుమారి
4) గజ్జెల మల్లారెడ్డి

16. తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు ఎవరు?
1) డాక్టర్ ఎన్. గోపి
2) బి.ఎస్. రాములు
3) కాలువ మల్లయ్య
4) దేవులపల్లి ప్రభాకరరావు

17. కింది వాటిలో త్రిభాషా సూత్రంలో ద్వితీయ భాషగా హిందీని వ్యతిరేకించిన రాష్ట్రం ఏది?
1) ఆంధ్రప్రదేశ్ 2) కర్ణాటక
3) తమిళనాడు 4) కేరళ

18. తెలంగాణ రాష్ట్రంలో ద్వితీయ అధికార భాష ఏది?
1) హిందీ 2) ఉర్దూ
3) మరాఠీ 4) కన్నడ

19. ప్రథమ భాషగా తెలుగు బోధనలో ప్రధాన ఉద్దేశం?
1) అర్థ గ్రహణం 2) అభివ్యక్తి
3) గుణ వివేచన 4) పైవన్నీ

20. తెలుగును ద్వితీయ భాషగా ఏయే మాతృభాషల వారు అభ్యసిస్తున్నారు?
1) హిందీ, ఉర్దూ
2) తమిళం, కన్నడం
3) గుజరాతీ, ఒరియా, మరాఠీ
4) పైవన్నీ

21. ద్వితీయ భాషగా తెలుగు బోధన ఉద్దేశం?
1) తెలుగు భాష సంస్కృతిని తెలియజేయడం
2) దైనందిన కార్యక్రమాల్లో తెలుగును ఉపయోగించే నైపుణ్యాన్ని పెంపొందించడం
3) తమ భాషల్లోని భావాలను తెలుగులోకి, తెలుగులోని భావాలను తమ భాషల్లోకి పరివర్తన చేసే పరిజ్ఞానం పెంపొందించడం
4) పైవన్నీ

సమాధానాలు

1) 3	2) 2	3) 3	4) 4	5) 2
6) 3	7) 3	8) 2	9) 3	10) 4
11) 1	12) 2	13) 1	14) 2	15) 3
16) 4	17) 3	18) 2	19) 4	20) 4
21) 4				

నాన్నా చెప్పవా

మనిషి కన్నా జీర్ణ వ్యవస్థ పొడవుగా ఎందుకుంటుంది?




చిన్న చిన్న పురుగులు, వాన పాముల్లాంటి జీవుల జీర్ణవ్యవస్థకు సంబంధించిన నాళాలు నోటి నుంచి పాయువు దాకా, దాదాపుగా ఆ జీవులంత పొడవుంటాయి. కాని పెద్ద పెద్ద జీవుల్లో మాత్రం వాటి జీర్ణవ్యవస్థ వాటి శరీరపు పొదవుకన్నా ఎన్నో రెట్లు పొడవుగా గాని లేదా ఉపరితల వైశాల్యంలో చాలా విశాలంగా గాని ఉంటుంది. ఉదాహరణకు ఒక మనిషి పొడవు కన్నా 'అన్నవాహిక – కడుపు సంచి – చిన్న పేగులు– పెద్ద పేగుల' తో కూడిన అతని జీర్ణవ్యవస్థ 10–12 రెట్లు ఎక్కువ పొడవుగా వుంటుంది. దాని పొడవు సుమారు 10 మీటర్లకు పైగానే వుంటుంది. ఎందుకు ఇలా ఉంటుందో స్పష్టంగా అర్థం కావాలంటే ముందుగా ఒక చిన్న పురుగు మనిషంత పెద్దగా మారినట్లుగా ఊహించుకోవలసి వుంటుంది.


10 సెం.మీ.ల పొడవుండే వాన పాము 20 రెట్లు పెద్దగా మారిందనుకుందాం (మనిషంత పొడవుగా). ఇలా జరిగినప్పుడు దాని పొడవు, వెడల్పు, మందం అన్నీ మారతాయి. అప్పుడు దాని బరువు మునపటి బరువుకన్నా 80,000 రెట్లు (10X20X20X20) పెరుగుతుంది. బరువుతో సమానంగా దానిలోని జీవకణాల సం ఖ్య, వాటి అవసరాలు కూడా పెరుగుతాయి.


10 సెం.మీ.ల వానపామును 20 రెట్లు పెద్దగా చేసినప్పుడు దాని జీర్ణ నాళం 200 సెం.మీ. (10X20) పొడవవుతుంది. ఆ జీర్ణనాళపు మందం కూడా పెరిగి అది 200 రెట్లు పెద్దగా (10X20) అవుతుంది. అయితే పెరిగే ఈ మందం వల్ల ఎలాంటి ప్రత్యేక ప్రయోజనమూ చేకూరదు. మొత్తానికి వానపాములోని జీవకణాల సంఖ్య 80,000 రెట్లు పెరిగితే, దాని జీర్ణనాళం మాత్రం పొడవులో 20 రెట్లు, ఉపరితల వైశాల్యంలో 4000 రెట్లు పెద్దగా మారుతుంది. అయితే శరీరంలోని జీవకణాల సంఖ్యతో పోల్చినప్పుడు జీర్ణనాళపు ఈ ఉపరితల వైశాల్యం ఏ మాత్రం సరిపోదు. అంత కన్నా 10–15 రెట్లకు పైగా వైశాల్యం కావలసి వుంటుంది. సరిగ్గా ఈ కారణం వల్లనే మనిషి జీర్ణాశయం అతని కన్నా చాలా రెట్లు పెద్దగా వుంటుంది.

అంకెలు కలపండి రంగులు వేయండి




పూరించండి






కుడివైపున కొన్ని బ్రాకెట్స్, వాటి కింద కొన్ని బొమ్మలున్నాయి. ప్రతి బొమ్మ ఇంగ్లిష్ పదం మొదటి అక్షరంతో పజిల్‌ను పూర్తిచేయండి. పూర్తయ్యాక వచ్చే పదం మనకు ఎడమవైపున కనిపించే బొమ్మ ఇంగ్లిష్ పదం అవుతుంది. ట్రై చేయండి చూద్దాం!

ఎడమవైపున ఉన్న బొమ్మను చూస్తూ కుడివైపున బొమ్మ గీయండి





F	S	K	A	T	I	N	G	H	O	C	K	E	Y	V
V	U	S	B	J	T	M	P	W	O	L	P	T	D	W
P	T	N	P	B	O	O	T	S	F	Y	S	A	L	T
S	N	O	W	M	A	N	Y	C	C	S	T	O	R	M
E	F	W	T	Z	L	S	E	I	R	R	U	L	F	S
S	F	M	L	E	E	L	Y	E	O	Y	Y	D	N	E
E	O	O	M	E	M	I	A	U	M	A	V	O	I	R
K	G	B	S	W	O	P	S	B	L	F	W	G	H	U
A	N	I	H	V	B	P	A	P	W	B	M	N	S	T
L	I	L	O	B	B	E	N	N	L	O	L	I	K	P
F	D	E	V	D	U	R	D	O	Q	U	N	H	I	L
X	I	N	E	D	B	Y	W	W	X	J	P	S	I	U
Z	L	K	L	N	I	E	L	D	T	L	D	I	N	C
F	S	V	V	L	R	K	T	F	I	R	D	F	G	S
T	S	C	R	A	P	E	R	J	W	W	H	I	T	E

BOOTS
DRIFT
FISHING
FLAKES
FLURRIES
FUN
HOCKEY
ICY
PLAY
PLOW
SALT
SAND
SCRAPER
SCULPTURE
SHOVEL
SKATING
SKIING
SLIDING
SLIPPERY
SNOWBALL
SNOWBLOWER
SNOWMAN
SNOWMOBILE
STORM
WHITE


పైన కొన్ని పదాలు ఉన్నాయి. పక్కన ఉన్న పజిల్‌లో ఆ పదాలు ఎక్కడున్నాయో కనిపెట్టండి చూద్దాం!







ఈ రెండు బొమ్మల మధ్య 8 తేడాలు ఉన్నాయి. గుర్తించండి.

దారి కనుక్కోండి





ఈ బాతుపిల్ల అసలు నీడ ఏదో కనిపెట్టండి చూద్దాం!


సమావేశమైన పాలకవర్గం సభ్యులు

నాణ్యతతో ప్రసాదాలు అందించాలి

- గూడెం ఆలయ పాలకవర్గ సమావేశంలో నిర్ణయం

దండేపల్లి(మంచిర్యాల): గూడెం శ్రీ సత్య నారాయణస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు నాణ్యతతో కూడిన ప్రసాదాలను అందించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. లడ్డూలు నెయ్యితో తయారు చేయాలని, పులిహోర మరింత రుచిగా తయారు చేయాలన్నారు. ఆలయ కమిటీ సర్వసభ్య సమావేశాన్ని చైర్మన్ గోవర్ధన వెంకటస్వామి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఆలయానికి సంబంధించిన మూడు నెలల ఆదాయ వ్యయాలను ఈవో నారాయణ సభ్యులకు తెలియజేశారు. అనంతరం ఆలయ అభివృద్ధిపై చర్చించారు. టికెట్ల ధరలను పెంచాలని, నాణ్యతో కూడిన ప్రసాదాలను తయారు చేయాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో కమిటీ సభ్యులు కొండా చంద్రశేఖర్, సాయిని సుధాకర్, కనగంటి తిరుపతి, కొండు సత్తయ్య, ఆకుల తిరుపతి, మారిసెట్టి సత్తవ్వ, గట్టు మురళీధర్, మేడి నారాయణ, గడుసు బాపు, గుర్రాల రాజిరెడ్డి, జాడి రమేష్ పాల్గొన్నారు.

వ్రత మండపానికి రూ.26లక్షలు..

గూడెం సత్యనారాయణస్వామి ఆలయం పక్కన వ్రత మండపం, వెయిటింగ్ హాలు నిర్మాణానికి సర్వశ్రేయోనిధి(సీజీఎప్) నుంచి రూ.26 లక్షలు, అన్నదాన సత్రం ముందు షెడ్డు నిర్మాణానికి రూ.12లక్షలు మంజూరైనట్లు కమిటీ చైర్మన్ వెంకటస్వామి, ఈవో నారాయణ తెలిపారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

మంచిర్యాలక్రైం: పట్టణంలోని 345 సర్వే నంబర్ లోగల ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మేకల రాములు అన్నారు. బుధవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ సురేందర్‌రావును ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రాములు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవువుతున్నాయని అన్నారు. రియల్ వ్యాపారులు కొంతమంది అధికారబలం, అంగబలంతో ప్రభుత్వ భూములను అక్రమంగా పట్టాలు చేసుకున్నారని ఆరోపించారు. అక్రమ పట్టాలపై సమగ్రా విచారణ జరిపి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కబ్జాదారుల చేతుల్లో


జేసీకీ వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్ష నాయకులు

ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని అర్హులైన పేదలకు వంద గజాల చొప్పున నివేశన స్థలాలు ఇవ్వాలని కోరారు. పేదలకు ఇంటి స్థలాలు సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సుధాకర్, లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్రె లచ్చన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, ఐఆర్‌సీపీ జిల్లా కో కన్వీనర్ జయరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, నాయకులు మల్లేష్, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ధర్నా


జేసీకి వినతిపత్రం అందజేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

మంచిర్యాలక్రైం: ఎస్సీ వర్గీకరణ, చెప్పు డప్పు వృత్తిదారులకు పెన్షన్ సాధన కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సురేందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కాశీ సతీష్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజారావు, రమేష్, విజయసాగర్, విక్రమ్, రాజేందర్, గట్టయ్య, మల్లేష్, నర్సయ్య, ఉదయ్‌కిరణ్, సందీప్, వెంకటేష్, లక్ష్మణ్, నరేష్, రాజయ్య పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే సేవలు మరువలేనివి

డీఈవో రవికాంత్‌రావు

మంచిర్యాలఅర్బన్: సావిత్రీబాయి పూలే జీవితం ఉపాధ్యాయులకు నిరంతర ఉత్తేజంలా పనిచేస్తుందని, ఆ మహనీయురాలు సమాజానికి చేసిన సేవలు ఎప్పటికి మరువలేనివని డీఈవో కె.రవికాంత్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్, నేషనల్ వుమెన్ టీచర్స్ ఫోరం సంయుక్తాధ్వర్యంలో సావిత్రీబాయి పూలే 187వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయినులు


మాట్లాడుతున్న డీఈవో రవికాంత్‌రావు

తమలోని శక్తియుక్తలను తెలుసుకుని ఆత్మవిశ్వాసం పెంచుకోంటూ విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించాలని సూచించారు. కేజీబీవీల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఇంటి కంటే ఎక్కువ సమయాన్ని పాఠశాలల్లోనే గడుపుతూ విద్య నేర్పిస్తారని అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతకుమారి మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినత్సోవంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్న, జిల్లా మహిళా ఉపాధ్యాయ ఫోరం నాయకురాలు సుమన, వివిధ మండలాలకు చెందిన నాయకులు సిలవేరు బాపు, మంజుల, కవిత, శ్రీవాణి, నాగచంద్రిక, కనకలక్ష్మి, మయూరి, హరిత, కల్పన, సుమలత, ఫణిబాల ల్గొన్నారు. అలాగే పట్టణంలోని శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో సాయిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ భూమేష్, ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులను నియంత్రించుదాం

మంచిర్యాల టౌన్: కీటక జనిత వ్యాధులను నియంత్రించేందుకు కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారిని విజయపూర్ణిమ అన్నారు. బుధవారం జిల్లాలోని సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, హెల్త్ అసిస్టెంట్లకు జిల్లా కేంద్రం లోని ఉపవైద్యాధికారి కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయి నుంచి పంపిన రక్తపూతలను సకాలంలో పరీక్షించి ఫలితాలను వెల్లడిం చాలని ల్యాబ్‌టెక్నీషియన్లకు సూచించారు. జిల్లా ఉపవైద్యాధికారిని ఏ.జ్యోతి మాట్లాడుతూ మలేరియా, డెంగీ పాజిటివ్ కేసులు నిర్ధారించబడితే ఆ ప్రాం తాల్లో వైద్యశిబిరాలను నిర్వహించాలన్నారు. ఇంటింటి సర్వే చేపట్టి, అనుమానిత కేసుల నుంచి రక్తపూతలు, సీరం సేకరించి ప్రయోగశాలకు పంపాలన్నా రు. సమావేశంలో సామాజిక ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారులు తొగరు ప్రభాకర్, నాందేవ్, పుట్ట సత్తయ్య, సూపర్‌వైజర్‌లు లక్ష్మణస్వామి, గంగయ్య, శ్రీనివాస్, శ్యామల, గణేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విజయపూర్ణిమ

అట్టహాసంగా విభాగ్ స్థాయి ఖేల్‌కూద్ పోటీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని రాంపూర్ శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో ఐదు జిల్లాలకు చెందిన విభాగ్ స్థాయి ఖేల్ కూద్ పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. డీఈవో రవికాంత్‌రావు, మంచిర్యాల, రామగుండం ఎంఈఐలు గుర్రం వివేకానంద్‌రెడ్డి, పూస్కూరి రంగారావు, ఆవాస విద్యాలయం అధ్యక్షుడు మాధవరపు వినయ్‌ప్రకాశ్‌రావు, శ్రీసరస్వతి విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విష్ణువర్దన్‌రావు, కరీంనగర్ శైక్షణిక్ ప్రముఖ్ కాటం రవీందర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ, విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడాంశాల్లో రాణించడం ద్వారా ఆత్మ విశ్వాసం, శారీరక దృఢత్వం పెరుగుతాయన్నారు.


ఆసక్తిగా సాగుతున్న ఖోఖో పోటీలు

గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. క్రీడల్లో తమ పిల్లలు భాగస్వామ్యం అయ్యేలా తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆహ్వానితులను సన్మానించగా ఆవాస విద్యాలయం ప్రధానాచార్యులు రావుల రామన్న, వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. చివరి రోజు విజేతలుగా నిలిచిన ఆయా జిల్లాలకు చెందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సదర్భంగా విద్యార్థు సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా అలరించాయి.



మాట్లాడుతున్న డీఈఓ రవికాంత్‌రావు

హలో సాక్షి..
చెన్నూర్ (ఆర్‌సీ) : 87908 11433,
చెన్నూర్‌రూరల్: 96661 54367,
మందమర్రి: 81063 85108,
జైపూర్: 85209 45664,
రామకృష్ణాపూర్: 99892 36655
భీమారం: 9441166869,
కోటపల్లి: 9014415943,
మందమర్రి రూరల్: 9949703181



ఆరుబయట వంటలు



భీమారంలో అసంపూర్తిగా ఉన్న వంటషెడ్డు



భీమారం హైస్కూల్‌లో ఆరుబయట వంట చేస్తున్న కార్మికులు

భీమారం: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో వంటషెడ్ల నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో విద్యార్థులకు వంట చేసేందుకు ఆరుబయట వండుతూ మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సంవత్సరం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలోని పాఠశాలల్లో వంట షెడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాలని మండల అధికారులకు సమాచారం అందింది. భీమారంలో 6, దాంపూర్‌లో 2, కొత్తపల్లిలో1, బూర్గుపల్లిలో 2, మద్దికల్‌లో1 వంటషెడ్డు నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపించారు. మొత్తం రూ.26 లక్షలతో 12 వంటషెడ్లు మంజూరయ్యాయి. విద్యాకమిటీ ద్వారా నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదించారు. దీంతో గ్రామాల్లో వంట షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభించినా నిధులు మంజూరుకాకపోవడంతో అర్ధంతరంగా నిలిపేయడంతో అసంపూర్తిగా మారాయి.

- ప్రభుత్వ పాఠశాలల్లో వంటషెడ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం
- పనులు ప్రారంభించినా నిధులు మంజూరు కాని వైనం
- అసంపూర్తిగా నిర్మాణాలు

ఇబ్బందుల్లో మధ్యాహ్న భోజన కార్మికులు

వంటషెడ్ల నిర్మాణ పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేయడంతో మధ్యాహ్న భోజన కార్మికులు ఆరు బయట వంట చేస్తూ ఇబ్బంది పడుతున్నారు. వానకు తడుస్తూ ఎండకు ఎండుతూ అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల్లో అదనపు తరగతి గదుల్లో కూడా వంట చేయడంతో పొగతో విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి అసంపూర్తిగా ఉన్న వంట షెడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరు బయటే వంట



గతకొన్నేళ్ల నుంచి ఆరుబయట వంట చేస్తున్నాం. ప్రభుత్వం ఈజీఎస్ ద్వారా వంటషెడ్లు నిర్మిస్తుందని చెప్పడంతో ఎంతో సంతోషపడ్డాం. కాని నిర్మాణంలో ఉన్నవి అర్ధాంతరంగా నిలిపివేయడం దారుణం.

– అన్నవేని భూదేవి, మధ్యాహ్న భోజన కార్మికురాలు

నిధులు మంజూరు కాలేదు



మండలంలో చేపట్టిన వంట షెడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు కావడం లేదు. 12 వంటషెడ్ల నిర్మాణం మొదట జోరుగా సాగాయి. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావడంలో ఆలస్యం కావడంతో పనులు నిలిపివేశారు.

– నాగేశ్వర్‌రెడ్డి ఎంపీడీవో

రోడ్డుపై మురుగునీరు



భీమారం: మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారిలోని భీమారం వద్ద మురుగుకాల్వలు లేకపోవడంతో ఇళ్ల నుంచే వచ్చే మురుగునీరు రోడ్డుపై చేరుతోంది. గతంలో జాతీయ రహదారికి కొన్నిచోట్ల కాల్వలు నిర్మించినా వాటిని పైపులైన్ కూల్చివేశారు. ఇప్పలబొగుడ నుంచి బీసీ కాలనీ వరకు మురుగునీరు వెళ్ల లేక అవి రోడ్డుపై చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడుతునా రు.

వాట్సప్ చేయండి

మీ దృష్టికి వచ్చిన సమస్యలు.. మీ చుట్టూ జరిగే అవినీతి అక్రమాలు.. ఆసక్తికర విశేషాలు ఏవైనా సరే... లక్షలాది మందితో పంచుకోవాలనుకుంటున్నారా? అయితే వాటిని మాకు పంపండి. దీనికోసం మీరు చేయాల్సిందల్లా మీరు గమనించిన అంశాల్ని మీ ఫోన్‌లో బంధించి మాకు వాట్సప్ చేయడమే. ప్రాధాన్యతను బట్టి వాటిని మేం ప్రచురిస్తాం. మరెందుకాలస్యం క్లిక్‌మనిపించండి.. వాట్సప్ చేయండి.

మా ఫోన్ నెంబర్ : 8790811433

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న కలెక్టర్

రామకృష్ణాపూర్: దివ్యాంగుల చైతన్య వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను బుధవారం కలెక్టర్ ఆర్వీ కర్ణన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రి యాంక కలెక్టర్ ఛాం బర్‌లో ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు మెడపట్ల సతీశ్, ప్రధాన కార్యదర్శి సముద్రాల చిరంజీవి, లక్ష్మయ్య, ఖలీల్ పాల్గొన్నారు.

మందకృష్ణను విడుదల చేయాలి

జైపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మార్పీఎస్ వ్యవసాపక అధ్యక్షుడు మంద కృష్టను బేషరతుగా విడుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేస్తూ బుధవారం తహసీల్దార్ రాజలింగంకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శులు ఇరిగిరాల మల్లేశ్, ఇరిగిరాల లింగయ్య, మండల అధ్యక్షుడు చిప్పకుర్తి శ్రీనివాస్, యువసేన మండల ఇన్‌చార్జి చిప్పకుర్తి శంకర్, నాయకులు రాజ్‌గోపాల్, కుమార్, శంకర్, తిరుపతి, రమేశ్‌పాల్గొన్నారు.

భీమారం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీజేఏసీ జిల్లా కన్వీనర్ పొడేటి సంజీవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో శాంతియుతంగా నిరాహారదీక్ష చేపట్టిన మందకృష్ణను పోలీసులు అరెస్ట్ చేయడం సరికాదన్నారు. .

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

మధ్యాహ్న భోజనంపై కేంద్ర సర్వీసుల కమిటీ తనిఖీ



జైపూర్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న సభ్యులు

జైపూర్: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం కేంద్ర సర్వీసుల కమిటీ సభ్యులు సందర్శించారు. కమిటీ సభ్యులు సంజయ్ రావత్, సంజీవ్‌ఖాల, గజేంద్రసింగ్‌లు పాఠశాలను సందర్శించి ఎస్ఎంసీ కమిటీ నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరుపై ఆరాతీశారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి రుచి చుశారు. మెనూప్రకారం మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారా లేదా అన్న అన్నవిషయాలపై ఆరాతీశారు. పాఠశాల్లో విద్యార్థుల హాజరు రికార్డు పరిశీలించారు. అనంతరం స్థానిక విద్యా వనరుల కేంద్రాన్ని సందర్శించి మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వివరాలు తదితర గడిచిన నాలుగేళ్ల పూర్తి నివేదికలు అందించాలని ఎంఈవో శ్రీనివాస్‌ను కోరారు. స్థానిక ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు అలీస్ మాధుర్య ఉన్నారు.

పకడ్బందీగా జంతు గణన వివరాలు నమోదు

కోటపల్లి: మండలంలోని అటవీప్రాంతంలో సంచరించే జంతువుల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని ఎఫ్‌డీవో రాజారావు సిబ్బందికి సూచించారు. బుధవారం మండలకేంద్రంలోని ఫారెస్టు రేంజ్ కార్యాలయంలో సిబ్బందికి శిక్షణనిచ్చారు. ఎఫ్‌డీవో రాజారావు మాట్లాడుతూ బీట్‌ను యూనిట్‌గా తీసుకుని శాఖాహార, మాంసాహార జంతువులపై గణన చేస్తారన్నారు. శాఖాహార జంతువులకు ట్రెల్ ఫాత్ ద్వారా గుర్తించవచ్చని తెలిపారు. అటవీప్రాంతంలో జంతువుల కదలికలు, వాటి పాదముద్రలు ద్వారా జీపీఎస్ మిషన్‌తో కొలత ద్వారా గుర్తించవచ్చని అన్నారు. ఎఫ్ఆర్వో రవికుమార్, అరవింద్, డిప్యూటీ రేంజర్ రేష్మా, ఎఫ్‌బీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న ఎఫ్‌డీవో



వెండితెర



మంచిర్యాలలో..
శ్రీవెంకటేశ్వర–
హలో
ఏషియన్ శ్రీనివాస –
ఎంసీఏ, (మిడిల్ క్లాస్ అబ్బాయి)
లక్ష్మి – టైగర్ జిందా హై
మయూరి – విక్రం 10
తిరుమల(స్ర్కీన్–1)(సీసీసీ)–
హలో
దేవి(స్ర్కీన్–2)(సీసీసీ) –
ఎంసీఏ, (మిడిల్ క్లాస్ అబ్బాయి)

యాదవుల సంక్షేమానికి కృషి

- ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు



కండువా కప్పుతున్న విప్ నల్లాల ఓదెలు

మందమర్రి: యాదవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు అన్నారు. స్థానిక రాజన్నల వాడలో బుధవారం పట్టణానికి చెందిన యాదవులు విప్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఓదెలు మాట్లాడుతూ ప్రభుత్వం యాదవుల కోసం హైదరాబాద్‌లో యాదవ సంక్షేమ భవనం నిర్మించడం హర్షణీయమన్నారు. ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, టీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో అన్ని కుల సంఘాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్వాల సమ్మయ్య, టీఆర్ఎస్ నాయకులు ఎస్.ప్రభాకర్, జే.రవీందర్, మేడిపెల్లి సంపత్, బత్తుల శ్రీనివాస్, ఓ.రాజశేఖర్, రాజన్నల సంఘం నాయకులు ఆవుల ఓదెలు పాల్గొన్నారు. మందమర్రి పట్టణంలో యాదవ కుల సంఘానికి భవనం నిర్మించాలని కోరగా విప్ సానుకూలంగా స్పందించారు.

పాఠశాల యాజమాన్య కమిటీలకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈవో

కోటపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో పాఠశాల యజమాన్య కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఎంఈవో జగన్ ప్రారంభించారు. ఈ సమావేశంలో యాజమాన్య కమిటీ నిర్మాణం, వారి విధులు, బాధ్యతలు, ఆర్టీఈ2009 సర్వశిక్షాఅభియాన్ నిర్వహించే కార్యక్రమాల గురించి వివరించారు. మండల రిసోర్సు పర్సన్ వెంకటేశ్వర్లు, సురేష్, ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వర్మీకంపోస్ట్ తయారీపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

జైపూర్: మండలంలోని కాన్కూర్‌లో వ్యవసాయశాఖ పరంపరాగత్ కృషివికాష్ యోజన పథకం ద్వారా బుధవారం రైతులకు వర్మీ కంపోస్ట్ తయారీ, దాని ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి సూజత, ఏఈవోలు ముత్యం తిరుపతి, అఖిల్‌లు రైతులకు వర్మి కంపోస్ట్ ప్రయోజనాలు వివరించారు. టెట్ర వర్మికంపోస్ట్ ప్లాస్టిర్ బెడ్స్‌ను వంద శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేశారు. వేపనూనె, వెస్టిడి కంపోసర్ల ఉపయోగాలు వివరించారు. ఆదేవిధంగా వందశాతం సబ్సిడీపై వేప నూనె పంపిణీ చేసినట్లు తెలిపారు. స్థానిక సర్పంచ్ బొల్లంపల్లి అంజాగౌడ్ పాల్గొన్నారు.

ఇంటి గోడకూలి ఎద్దు మృతి



చెన్నూర్‌రూరల్: మండలంలోని చింతలపల్లిలో తొర్రం శంకరయ్య అనే వ్యక్తికి చెందిన ఇంటి గోడ కూలి ఎద్దు మృతి చెందింది. మంగళవారం అర్ధ రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఇంటి గోడ ఒక్కసారిగా బయట వైపు కూలి ఎద్దుపై పడటంతో మృత్యువాత పడింది. ఎద్దు విలువ రూ.40వేలు ఉంటుందని బాధితుడు శంకరయ్య వాపోతున్నాడు.

దళితులపై దాడులు అమానుషం

మందమర్రిరూరల్: దళితులపై దాడులు జరగడం అమానుషమని బీజేపీ రాష్ట్రకార్యదర్శి వెంకటరమణ, జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణ అన్నారు. పట్టణంలో బుధవారం బీజేపీ దళితమోర్చా కార్యవర్గసమావేశానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్‌లో దళితుల పక్షాన ముందుండి పోరాడానికి పార్టీలు వివిధ కార్యక్రమాలు చేపడుతుందన్నారు.

ఘనంగా సావిత్రీబాయి జయంతి



చెన్నూర్‌రూరల్: పొక్కూరు జెడ్పీ సెకండరీ పాఠశాల్లో..



చెన్నూర్: సావిత్రీ బాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న పీఆర్టీయూ నాయ ులు

- ఆమె అందరికీ ఆదర్శప్రాయం
- ప్రజాప్రతినిధులు, నాయకులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూరు, సుద్దాల, దుగ్నెపల్లి, శివలింపూర్, తదితర గ్రామాల్లోని జిల్లా పరిషత్ సెకండరీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలతోపాటు, కొమ్మెర పంచాయతీ కార్యాలయంలో బుధవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆమె చేసిన సేవల గురించి విద్యార్థులకు తెలియజేశారు. సర్పంచ్ మాధవి, హెచ్ఎంలు చౌదరి, ఓంప్రకాశ్, బానయ్య, బిల్లా తిరుపతయ్య, కృష్ణమూర్తి, ఉపాధ్యాయుడు సంతోశ్, పంచాయతీ సెక్రటరీ మల్లేశ్ పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో సావిత్రీబాయి పూలే జయంతి ఉత్సవాలను బీసీ సంక్షేమ సంఘం, టీఆర్ఎస్వీ, డీటీఎఫ్, పీఆర్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రవి, బిల్లా తిరుపతయ్య, తాటికొండ సురేశ్, రవికుమార్, బుర్ర రాకేశ్‌గౌడ్, ఇప్ప రాకేశ్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్‌లోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల్లో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేశారు. బాలికల విద్య కోసం ఆమె చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు రాపర్తి లక్ష్మీనారాయణ, దామోదర్‌రెడ్డి, రామన్న, రవీందర్ పాల్గొన్నారు. బాలికల ఉన్నత పాఠశాల్లో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జయంతి వేడుకల్లో ఉపాధ్యాయినులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి, మండల అధ్యక్షుడు అరవింద్‌కుమార్, సత్యనారాయణ, శ్రీకాంత్, సుధాకర్‌నాయక్ పాల్గొన్నారు.

జైపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం స్థానిక ప్రధానోపాధ్యాయురాలు అలీస్ మాధుర్య, గురుకుల పాఠశాలల రీజినల్ కోఆర్డినేటర్ వెంకటలక్ష్మిని ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. నేతకాని మహర్ కుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నర్వ పాఠశాల్లో, బీఎస్పీ ఆధ్వర్యంలో దుబ్బపల్లి పాఠశాల్లో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. నర్వ పాఠశాల్లో జిల్లా ఉపాధ్యక్షుడు పొట్టాల నాగరాజు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్ విద్యార్థులకు విద్యసామగ్రి అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సన్మానించారు. ఎంఈవో శ్రీనివాస్, గురుకుల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మహదేవ్ పాల్గొన్నారు.

మందమర్రి: మందమర్రి పాత బస్టాండ్‌లోని జయశంకర్ చౌక్ వద్ద సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి బీసీ సంఘాల నాయకుడు పెద్దపల్లి సత్యనారాయణ పూలమాల వేశారు. ఎర్రోజు శ్రీనివాస్, గాజుల ప్రతాప్, నోముల ఉపేందర్, దాసరి శ్రీనివాస్, ములుమూరి రమేశ్, జక్కుల సమ్మయ్య, మంచికట్ల శ్రీనివాస్, డాక్టర్ బి.చంద్రమౌళి, నల్లుల శంకర్, బైరాజు శ్రీనివాస్, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కోటపల్లి: స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల్లో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి చెన్నూర్ రూరల్ సీఐ బొల్లం రమేశ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులు హరిత, సుమలత, మమత, ఉపాధ్యాయులను సన్మానించారు. హెచ్ఎం సూర్యాదాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో రవీంద్రనాథ్‌చారి, కొండపేట ఉప సర్పంచ్ నీల మనోహర్, ఉపాధ్యాయులు కొట్టె శంకర్, బాలకృష్ణ, సురేందర్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో సావిత్రీ బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. నాయకులు కలగూర రాజ్‌కుమార్, జలంపల్లి తిరుపతి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగరాజు, రాజేశ్, మహేశ్, మల్లేశ్, రాజు, వంశీ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారం ప్రభుత్వ పాఠశాల్లో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి ఉపాధ్యాయులు, మాలీ కుల సంఘం నాయకులు పూలమాల వేశారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. మాలీ కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్రంగి రాంచందర్, మండల అధ్యక్షుడు రవీందర్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



మందమర్రి: సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేస్తూ..



రామకృష్ణాపూర్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు



నిరుపయోగంగా బస్టాండ్



భీమిని: మూడు మండలాలను కలిపే కూడలి వద్ద రాంపూర్ బస్టాండ్ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి నిరూపయోగంగా ఉంది. ప్రయాణికులు బస్టాండ్‌లో ఉండలేక దగ్గరలోని చెట్ల కింద ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ సేదతీరుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం మూడు మండలాలకు వెళ్లే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఈ బస్టాండ్‌ను పిచ్చిమొక్కలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9701909596

న్యూస్ బాక్స్

దోమతెరల పంపిణీ



దోమతెరలు అందజేస్తున్న సర్పంచ్

నెన్నెల: మండలంలోని ఆవుడం ప్రజలకు బుధవారం ఇంటికొక దోమతెరను పంపిణీ చేసినట్లు మెడికల్ ఆఫీసర్ ఝాన్సీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆవుడం సర్పంచ్ హేమలత పాల్గొని మాట్లాడారు. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ దోమతెరలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. దోమల బారి నుంచి ప్రజలను కాపాడేందుకు దోమతెరలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మెర్సీ, ఏఎన్‌ఎం ఇందిర, మల్లేశ్వరి, లలిత, హెల్త్ అసిస్టెంట్లు రాజ్‌కుమార్, ప్రభాకర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు బెల్లంపల్లికి 'చాడ' రాక

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో నిర్వహించనున్న జిల్లా కౌన్సిల్ సమావేశానికి గురువారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి రానున్నారని ఆ పార్టీ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి మంతెన మల్లేశ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు పార్టీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సభ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

స్వచ్ఛత వైపు అడుగులు..

సెకండ్ గ్రేడ్ మున్సిపాలిటీ బెల్లంపల్లి ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ (ఓడీఎఫ్)గా ఎంపికైంది. మున్సిపాలిటీని కేంద్ర ప్రభుత్వం బహిరంగ మల,మూత్ర విసర్జన రహిత పట్టణంగా ప్రకటించింది. ఈమేరకు జనవరి 1న కేంద్రం ఓడీఎఫ్‌గా ప్రకటించి మున్సిపాలిటీకితీపి కబురును అందించింది.



మున్సిపల్ కార్యాలయ భవనం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీని ఓడీఎఫ్‌గా ప్రకటించడానికి కొన్ని నెలల నుంచి తీవ్రమైన కసరత్తు చేసి మున్సిపల్ యంత్రాంగం సక్సెస్ అయ్యింది.మున్సిపాలిటీలో ఉన్న ప్రతి ఇంటిలోనూ వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణానికి చర్యలు తీసుకుంది.ఇందుకోసం పుర ప్రజలకు అవగాహన కల్పించి, వార్డుల వారీగా వ్యక్తిగత మరుగుదొడ్డి లేని ఇళ్లను ముందస్తుగా గుర్తించారు. ఆ తీరుగా లబ్ధిదారులను ఎంపిక చేశారు.ఆర్థిక స్తోమత లేని పేదలకు కాంట్రాక్టర్‌తో మరుగుదొడ్లు కట్టించగా ,మరి కొందరికి మున్సిపల్ అధికారులు ముందుడి నిర్మాణం చేయించారు. మిగతా లబ్ధిదారులు ఎవరికివారే మరుగుదొడ్లు కట్టుకున్నారు. ఆ ప్రకారంగా మున్సిపాలిటీలో లక్ష్యానికి అనుగుణంగా మరుగుదొడ్లను నిర్మించి ఓడీఎఫ్‌కు ఎంపికయ్యారు.

ఎంపికకు ఇవీ కారణాలు

ఓడీఎఫ్‌గా ప్రకటించడానికి కేంద్రం పలు తీరుగా ప్రమాణాలను సర్వే చేసింది. చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు వెళ్లే వాహనాలు ఇష్టారాజ్యంగా తిరగకుండా ఉండేందుకు వెహికల్ ట్రాకింగ్ సిస్టంను అమలు చేయడం, సిబ్బంది కచ్చితంగా సమయ పాలన పాటించడానికి బయోమెట్రిక్ విధానాన్ని అవలంభించడం, బల్దియాలో ప్లాస్టిక్ లేకుండా చేయడం, సిటీజన బుడ్డీ ఏర్పాటు చేసి అమలు చేయడం. సీసీ కెమెరాలు బిగించడం, ఈజీ ఆఫ్ బిజినెస్ డూయింగ్ (ఈఓబీడీ) వంటి కార్యక్రమాలను నిర్వహించడంతో కేంద్రం బెల్లంపల్లి మున్సిపాలిటీని ఓడీఎఫ్‌గా ప్రకటించడానికి వీలు కలిగింది.అంతకు ముందే కేంద్రం థర్డ్ పార్టీతో సర్వేను నిర్వహించి, వివరాలను గోప్యంగా రాబట్టింది.

ఓడీఎఫ్ వివరాలు

వచ్చినవి దరఖాస్తులు	అనుమతినిచ్చినవి	తిరస్కరించినవి	నిర్మించిన మరుగుదొడ్లు	వ్యయం రూ.కోట్లలో
	–	–		
2,323	1577	765	1577	1,88,44000

నిధుల మంజూరుకు అవకాశాలు

మున్సిపాలిటీని కేంద్రం ఓడీఎఫ్‌గా ప్రకటించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయడానికి మార్గం సుగమమైంది. అంతకుముందే రాష్ట్ర ప్రభుత్వం ఓడీఎఫ్‌గా ఎంపికైన మున్సిపాలిటీలకు మాత్రమే అభివృద్ధి నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు.ప్రభుత్వం నుంచి నిధులు రావడానికి ఓడీఎఫ్ అడ్డంకిగా ఉండటంతో అష్టకష్టాలు పడి సాధించారు. దీంతో ఇకపై నిధుల మంజూరుకు బెల్లంపల్లి బల్దియా అర్హతను సాధించింది.

స్వచ్ఛ సర్వేక్షణ్ దిశగా..

మున్సిపాలిటీ క్రమంగా స్వచ్ఛ సర్వేక్షణ్ దిశగా అడుగులు వేస్తోంది.రాష్ట్ర వ్యాప్తంగా 72 మున్సిపాలిటీలు ఉండగా వీటిలో స్వచ్ఛ సర్వేక్షణ్ కోసం 52 మున్సిపాలిటీలను గుర్తించారు.వీటిలో బెల్లంపల్లి మున్సిపాలిటీ ఒకటి కావడం గమనార్హం. ఈనెల 1నుంచి 25 వ తేదీ వరకు మున్సిపాలిటీలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన థర్డ్ పార్టీ సర్వే చేసి కేంద్రానికి నివేదిక పంపుతుంది. పుర ప్రజల నుంచి కూడా సమాచారం సేకరిస్తారు. ఆ తర్వాత సేకరించిన వివరాలను క్రోడీకరించి ర్యాంకింగ్ నిర్దేశిస్తారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఎంఈవో ప్రభాకర్

తాండూర్: పాఠశాలల అభివృద్ధిలో పాఠశాల యాజమాన్య కమిటీలు పూర్తి స్థాయిలో భాగస్వాములు కావాలని ఎంఈవో వాసాల ప్రభాకర్ అన్నారు. బుధవారం తాండూర్ మండలం తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీల ఒక్క రోజు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలల అభివృద్ధి బాధ్యత యాజమాన్య కమిటీ సభ్యులపై ఉందన్నారు. చైర్మన్, సభ్యులు పాఠశాల పర్యవేక్షణ చేస్తూ గ్రామాల్లోని బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే గురుతర బాధ్యతను తీసుకోవాలన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్టం చేసేందకు తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు ఇస్తూ తద్వారా పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తాండూర్, రేచిని, తాండూర్ ఉర్దూ మీడియం ప్రధానోపాధ్యాయులు మురళీధర్ రావు, మల్లేశం, పద్మజలతో పాటు పలు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

తాండూర్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ముద్రించిన 2018 క్యాలెండర్‌ను బుధవారం తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో ప్రభాకర్, తపస్ జిల్లా కార్యదర్శి బండి రమేశ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ సమస్యలను, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఉపాధ్యాయ సంఘాలు ముఖ్య భూమిక పోషించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు పర్వతాల నర్సయ్య, మండల అధ్యక్షుడు జనగామ వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వెండితెర



హలో

రామకృష్ణ (బెల్లంపల్లి)

11.15, 2.15, 6.15, 9.15

ఎంసీఏ

బాలాజీ (బెల్లంపల్లి)

11.15, 2.15, 6.15, 9.15

ఎంసీఏ

వెంకటరమణ

(కాగజ్‌నగర్)11.00,2.00, 6.00, 9.00



నిధుల మంజూరుకు మార్గం సుగమం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ ఓడీఎఫ్‌గా ఎంపిక కావడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయడానికి అవకాశాలు ఏర్పడ్డాయని మున్సిపల్ చైర్‌పర్సన్ సునీతారాణి, మున్సిపల్ రెవెన్యూ అధికారి జి.మల్లారెడ్డి తెలిపారు.బుధవారం కమిషనర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఓడీఎఫ్‌గా ఏర్పడడానికి ఎంతగానో శ్రమించాల్సి వచ్చిందన్నారు. సమావేశంలో మున్సిపల్ డీఈ దయాకర్, ఏఈ సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

జోన్‌గైడ్

క్రికెట్ పోటీలు ప్రారంభం

భీమిని: కన్నెపల్లి మండలంలో స్టనర్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో జిల్లాలోని 60 టీమ్‌లు సభ్యత్వం నమోదు చేసుకున్నాయి. ఇందులో బుధవారం మొదటి రోజు దహెగాం, కన్నెపల్లి జట్లు పోటీ పడగా దహెగాం జట్టు గెలుపొందింది. ఈ క్రికెట్ పోటీలు వారం రోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు, టీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు సుంకరి తిరుపతి తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.8 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5 వేలు, మెమోంటోలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్, మాజీ సర్పంచ్ పుల్లూరి రాజయ్య, జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయుడు సంజీవ్, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నెన్నెల: మండలంలోని గొల్లపల్లిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను బుధవారం 731 పశువులకు వేసినట్లు పశువైద్యాధికారి దిలీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పశువులకు టీకాలు వేసుకోవాలని సూచించారు. రైతులు పూర్తిగా ఈ కార్యక్రమానికి సహకరించాని కోరారు. ప్రతి గ్రామానికి వెళ్లి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని రైతులు పశువులను ఉదయం పూట ఇంటి వద్దనే ఉంచి టీకాలు వేసి సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతిగౌడ్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి

బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం బెల్లంపల్లిలో తొలి మహిళ ఉపాధ్యాయురాలు జ్ఞానజ్యోతి సావిత్రిబాయి పూలే 187 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి .ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. సంక్షేమ గురుకులాల ఆదిలాబాద్ ప్రాంతీయ అధికారి వెంకటలక్ష్మి స్వేరోస్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.అక్కడి నుంచి ప్రారంభమైన ర్యాలీ బెల్లంపల్లి బజారు ఏరియా పుర వీధుల మీదుగా సాగింది. బెల్లంపల్లి ,కాసిపేట గురుకులాల విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్స్ ఐనాల సైదులు ,పి.శ్రీనివాసులు , ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.బజారు ఏరియా పాత క్లబ్ స్కూల్‌లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతిని నిర్వహించారు.ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

నెన్నెల: మండలంలోని ఆవుడం, మైలారం ఉన్నత పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించినట్లు అశ్విని‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలుఅర్పించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శివసాయిగౌడ్, అనూష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో 187వ సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం ఘనంగా జరిపారు. కన్నెపల్లి మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పూలే జయంతి వేడుకలకు డీఈవో రవికాంత్ ముఖ్య అతిథిగా హాజరై చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేమనపల్లి: మండలకేంద్రంతో పాటు అన్ని పాఠశాలల్లో బుధవారం ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంఈవో తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హెచ్ఎం నాను, సురేష్, సంతోష్, గోపీచంద్ పాల్గొన్నారు.

తాండూర్: భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం తాండూర్ మండలం తంగళ్లపల్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో వాసాల ప్రభాకర్ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాండూర్, రేచిని, అచ్చలాపూర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మురళీధర్ రావు, మల్లేశం, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమగూడెం లంబాడి తండా పాఠశాలలో టీమాస్ ఫోరం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, దేవాపూర్ నాయకపుగూడ ప్రాథమిక పాఠశాలలో ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవాపూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో పూలేకు నివాళులర్పించారు. ఎంఈవో దామోదర్, టీమాస్ ఫోరం స్టీరింగ్ సభ్యులు సంకె రవి, దుర్గం గోపాల్, సాలోజు మురళి, చందులాల్, బోగే పోశం, దేవాపూర్‌లో తుడుందెబ్బ రాష్ట్రకార్యదర్శి కొమ్ముల బాపు, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణరెడ్డి, కుర్సింగ నాగేశ్వరరావు, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణభాస్కర్, ఉపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి తదితరులున్నారు.



బెల్లంపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న హాస్టల్ విద్యార్థులు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తాండూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ మాదారం 3 ఇంక్లైన్ గ్రామంలో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం భూమిపూజ చేశారు. రూ.3 లక్షల సింగరేణి కోల్‌బెల్ట్ నిధులతో చేపట్టిన ఈ పనులను తాండూర్ జెడ్పీటీసీ సభ్యుడు మంగపతి సురేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హయాంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ వచ్చిందన్నారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా టీఆర్ఎస్ ప్రభుత్వం మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుబ్బ దత్తుమూర్తి, దుగుట శ్రీనివాస్, గొర్లపల్లి విజయ్, రాజేందర్, షేక్ హైమద్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

బెల్లంపల్లి: నల్గొండ జిల్లా నాగార్జున సాగర్‌లో ఈనెల 6,7 తేదీల్లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ రాజకీయ శిక్షణ తరగతుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. బుధవారం పట్టణంలోని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ సంఘం శ్రేణులు పోస్టర్‌ను విడుదల చేశారు.రాజకీయ శిక్షణ తరగతులకు ప్రజా గాయకుడు గద్దర్, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ తదితరులు వక్తలుగా హాజరవుతారని తెలిపారు. మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎల్తూరి శంకర్, రాష్ట్ర నాయకులు కె.నారాయణ, నాయకులు గంగాధర్, నారాయణ, రాజనర్సు ,ప్రసాద్ ,రాజ్‌కుమార్, గోవింద్, రాజం, కొమురయ్య పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో

కాసిపేట: మండలంలోని లంబాడితండా ప్రాథమిక, జిల్లాపరిషత్ పాఠశాలలను బుధవారం ఎంఈవో దామోదర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో రికార్డులు పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న గ్రాండ్ టెస్టును పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు లచ్చన్న, వేణుమాధవ్ తదితరులున్నారు.

టీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

భీమిని: భీమిని మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో బుధవారం తెలంగాణ టీచర్స్ యూనియన్(టీటీయూ) క్యాలెండర్‌ను ఆ సంఘం అధ్యక్షులు శివరామకృష్ణ, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీటీయూ ఆధ్వర్యంలో 2004 సెప్టెంబర్ తర్వాత నియామకమైన ఉపాధ్యాయులకు అమలవుతున్న సీపీఎస్ విధానం రద్దు చేయాలని పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టబోతున్నట్లు ప్రకటించారు. టీటీయూ ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ హెల్ప్‌లైన్‌ను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ హెల్ప్‌లైన్ నంబర్ 96767134005 సంప్రదించి సమస్యలపై తగు సూచనలు, సలహాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహ అధ్యక్షుడు నిమ్మల రమేష్, జిల్లా అధ్యక్షులు దాగం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

తనయుడి జ్ఞాపకార్థం..

తాండూర్: మండల కేంద్రానికి చెందిన టీఆర్ఎస్ నాయకుడు, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు మానాల రఘుపతి తన తనయుడు మానాల సురేష్ జ్ఞాపకార్థం క్యాలెండర్లను ముద్రించి ఆవిష్కరించారు. మానాల సురేష్ జ్ఞాపకార్థం ముద్రించిన శ్రీ ఏకోత్తర శత పద్మశాలి వంశవృక్ష క్యాలెండర్‌ను బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మంగపతి సురేష్‌బాబు చేతుల మీదుగా విడుదల చేశారు. అందరికీ పంపిణీ చేశారు. నాయకులు దుగుట శ్రీనివాస్, మాసాడి తిరుపతి, గొర్లపల్లి విజయ్, వెంకటేష్, మద్దికుంట రాంచందర్, మానాల రాజమౌళి, మానాల సురేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


పుణ్యస్నానాలు చేసి గుహనుంచి బయటికి వస్తున్న భక్తులు


బారులు తీరిన మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ భక్తులు

జై జంగో.. జై లింగో

- జనసంద్రమైన 'కప్లె' పుణ్యక్షేత్రం
- దీక్షాదారుల ప్రత్యేక పూజలు
- వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలం తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దున ఉన్న శంకర్‌లొద్ది సమీపంలో గల కప్లె పుణ్యక్షేత్రం జనసంద్రమైంది. తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ భక్తులు వేలాదిగా తరలివచ్చి కప్లె గుహను సందర్శించారు. ఈ పుణ్యక్షేత్రానికి 3500 ఏళ్ల నాటి చరిత్ర ఉందని కటోడా సిడాం భీము చెప్పారు. సాధారణ భక్తులతో పాటు 'జై జంగో.. జై లింగో' భక్తులు కూడా భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఇక్కడ జంగుబాయి, భీమదేవర, పోచమ్మ తల్లి బస చేసి ఉందని భక్తుల నమ్మకం.


గుహలోకి వెళ్తున్న భక్తులు

పాదాలపై నడుస్తూ..

భక్తులు గుహలోని దేవాతా మూర్తులను దర్శించుకునేందుకు సుమారు కిలో మీటరు దూరం గుహలో కూర్చుని పాదాలపై వెళ్లి పవిత్రమైన నదిలో పుణ్యస్నానాలు చేశారు. గుహ మధ్యలో 'దొంగల గుర్తు పట్టే దర్వాజ' కూడా ఉంది.

శివలింగాన్ని దర్శించుకున్న భక్తులు..

నెల రోజులుగా నియమ నిష్టలతో చేపట్టే జై జంగో.. జై లింగో స్వాములతోపాటు భక్తులు శంకర్‌లొద్ది సమీపంలోని శివలింగాన్ని దర్శించుకున్నారు. జై జంగో.. జై లింగో నామస్మరణతో శంకర్‌లొద్ది దద్దరిల్లింది.


శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు


గుహ లోపల నీటి గుండంలో స్నానాలు చేస్తున్న భక్తులు


దుర్గాదేవి ప్రతిమను బయటికి తీసుకవస్తున్న భక్తులు


శివలింగం దర్శనానికి బారులు తీరిన భక్తులు


రామానంద్, మాధవరావు చిత్రపటాలు

'గంగ' తీరం.. జన సాగరం

జైనథ్(ఆదిలాబాద్): జైనథ్ మండలంలోని డొల్లార గ్రామ సమీపంలో పెన్‌గంగ నదీ తీరాన బుధవారం నిర్వహించిన గంగ జాతరకు భక్తజనులు పోటెత్తారు. భక్తులు నదిలో పుణ్య స్నానాలు ఆచరించి పిండి వంటలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం నది ఒడ్డున గల రామానంద్, మాధవ్‌రాజ్ మహారాజ్‌ల ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. నదీతీరంలో రథ ప్రతిష్ఠ నిర్వహించారు. మహరాజ్‌ల పాదుకలను మహారాష్ట్రలోని బోరి సంస్థాన్ నుంచి పాదయాత్రగా తీసుకువచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. అనంతరం భక్తుల దర్శనార్థం రథయాత్ర ఏర్పాటు చేశారు. గంగ మాతకు హారతి, ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. గత 129 ఏళ్ల నుంచి ఈ జాతర ఉత్సవాలు ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు.

ఆకట్టుకున్న జాతర..

నదీ తీరాన నిర్వహించిన జాతర ఆకట్టుకుంది. రంగులరాట్నం, మౌత్‌క కూవ, డిస్నీ డ్యాన్స్‌లతో పాటు దుకాణ సముదాయాలు ఆకట్టుకున్నాయి.


కాల దహీహండీ నిర్వహిస్తున్న భక్తులు


భజనలు చేస్తున్న భక్తులు


జనసంద్రమైన గంగా నదీ తీరం


గంగమ్మకు మొక్కుతున్న యువతి

- అంధత్వాన్ని జయిస్తున్న విద్యార్థులు
- కళ్లు లేకున్నా చదువులో రాణింపు
- నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి, 6న వర్ధంతి

చుట్టూ చీకట్లు.. వెలుగులు చూడని జీవితాలు.. ప్రపంచం ఎలా ఉంటుందో తెలియదు.. అద్దంలో తన రూపమెలా ఉంటుందో చూడలేదు.. భవిష్యత్ అంతా నలుపే.. అనుకున్న వారి జీవితాల్లో వెన్నెల కాసింది. చూపులేని వాళ్లకు దారిచూపింది.. జీవితానికి సరిపడా అక్షర వెలుగుల్ని నింపింది. ఆ వెన్నెలే లూయి బ్రెయిలీ.. అంధుల కోసం ఒక లిపిని రచించి ఆరాధ్య దైవంగా నిలిచాడు. నేడు ఆయన జయంతి సందర్భంగా మంచిర్యాలలోని అంధుల పాఠశాలను 'సాక్షి' సందర్శించింది. విద్యార్థులతో ముచ్చటించింది..


బ్రెయిలీలిపితో అక్షరాలు రాస్తున్న అంధ విద్యార్థులు


అంధులకు 'బ్రెయిలీ' వెలుగు

ఉమ్మడి జిల్లాలో ఏకైక అంధుల పాఠశాల

ఉమ్మడి జిల్లాలో అంధులు 500లకు పైగానే ఉన్నారు. వీరికి ప్రభుత్వం తరుపున ప్రత్యేక పాఠశాలలు లేవు. మంచిర్యాల పట్టణంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'సాయి అంధుల పాఠశాల'ను ఏర్పాటు చేసి గత ఎనిమిదేళ్లుగా పలువురు అంధ విద్యార్థులకు ఉచితంగా విద్యను, వసతిని అందిస్తున్నారు. దాతల సహాయంతో నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 20 మంది అంధ విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు, భోజన వసతిని కల్పిస్తున్నారు. మరికొందరు హైదరాబాద్‌లోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో చదువుతున్నారు. మంచిర్యాల అంధుల పాఠశాలలో వీరికి విద్యతో పాటు, సంగీతం, నృత్యం, వాయిద్యం, యోగా, మెడిటేషన్, కరాటే, అబాకస్, ఆటలు, కంప్యూటర్‌లో శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వమే ఒక అంధుల పాఠశాలను నెలకొల్పి, వారికి విద్యను అందించేలా అన్ని ఏర్పాట్లు చేస్తే జిల్లాలోని అంధులకు మరింత లబ్ధి చేకూరే అవకాశం ఉంది. బ్రెయిలీ లిపి ద్వారా చదివేందుకు వీలుండగా, కంప్యూటర్ కీబోర్డులు సైతం అందుబాటులోకి రావడంతో వీరికి సాంకేతిక విద్య కూడా దగ్గరైంది.


జనవరి 4న జన్మించిన లూయిస్ బ్రెయిలీ

మంచిర్యాలటౌన్: 1809 జనవరి 4న లూయిస్ బ్రెయిలీ ప్యారీస్‌కు సమీపంలోని క్రూవే గ్రామంలో మోనిక్ బ్రెయిలీ, సైమన్‌రెనె బ్రెయిలీ దంపతులకు జన్మించారు. గుర్రాలశాలలో పని చేస్తున్న తండ్రితో పాటు వెళ్లిన బ్రెయిలీకి ఓ ప్రమాదంలో కళ్లు పోవడంతో తన నాలుగో ఏటనే బ్రెయిలీ పూర్తిగా గుడ్డివాడయ్యాడు. పాఠశాలకు వెళ్లి కేవలం వినడం ద్వారా పాఠాలు నేర్చుకున్నాడు. అక్షరాలు చదవలేని లూయిని చూసిన అతడి తండ్రి చెక్కపై అక్షరాలు చెక్కి ఇచ్చాడు. తర్వాత అంధుల పాఠశాలకు వెళ్లిన లూయిస్ లెన్‌టెప్ పద్ధతిలో రాగిరేకులపై రాసిన అక్షరాలను చదువుకోవాలంటే ఇబ్బందిగా ఉండేది. అయినా వాటిని అర్థం చేసుకుని చదువుకున్న లూయిస్, పాఠశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చేవాడు. తన 17వ ఏటనే అదే పాఠశాలలో లూయిస్ ఉపాధ్యాయుడిగా మారారు. అంధులకు చదువు చెప్పాలంటే వారికి లిపి కావాలి. స్పర్శ తప్ప మరో మార్గంలో వారు స్వయంగా చదువుకోలేరని గుర్తించాడు. అందుకే మామూలు ప్రింటింగ్ పద్ధతి కాకుండా, చేతి స్పర్శ తగిలేలా లిపిని రూపొందించాడు. ఉద్యోగం చేస్తూనే ఖాళీ సమయంలో ఐదేళ్లు కష్టపడి ఆరు చుక్కలతో కూడిన, సులభమైన లిపిని కనుగొన్నాడు. చుక్కల రూపంలో ఉన్న లిపిని తయారు చేసిన లూయిస్, ఆ లిపికి అతడి పేరులోని చివరి పదాన్ని కలిపి 'బ్రెయిలీ లిపి'గా మార్చాడు. ఆ లిపి కొద్ది రోజుల్లోనే ప్రపంచ ప్రాచుర్యం పొందింది. ఇప్పటికే బ్రెయిలీ లిపిలో అనేక గ్రంథాలు, పుస్తకాలు ముద్రించారు. కంప్యూటర్‌ను సైతం ఉపయోగించడంలోనూ అంధులు ముందుంటున్నారు. క్షయవ్యాధితో బ్రెయిలీ 1852 జనవరి 6న మరణించినా, తన లిపితో అంధుల గుండెల్లో కలకాలం జీవిస్తున్నాడు.


లూయి బ్రెయిలీ


సంగీత సాధనలో అంధ విద్యార్థి

చదువుకునే అవకాశం ఇచ్చారు



నేను చెన్నూర్ మండలం నర్సక్కపేట నుంచి వచ్చి ఇక్కడ చదువుతున్నాను. నాకు కళ్లు లేకున్నా అందరిలాగే చదువుకునే అవకాశం బ్రెయిలీ లిపితో కలిగింది. మేం చక్కగా రాయడం, చదవడం చేస్తున్నాం. ఇదే లిపితో బాగా చదువుకుని ఉన్నత స్థానానికి వెళ్లాలని ఉంది. మాలాంటి అంధులు ప్రతి ఒక్కరూ చదువుకుని, బ్రెయిలీ ఆశయాలకు అనుగుణంగా అంధులకు ఉపయోగపడేలా ఉండాలి.

– నగరం అంజలి, తొమ్మిదో తరగతి

ఆరు చుక్కలతోనే చదువు



ఆదిలాబాద్ మండలం తుర్కచాంద నుంచి వచ్చి ఇక్కడ చదువుతున్నాను. బ్రెయిలీ రూపొందించిన లిపిలో ఆరు చుక్కలతో తెలుగు, ఇంగ్లిష్ భాషలను చక్కగా నేర్చుకుంటున్నాం. అందరిలాగే మేం కూడా చదవడం, రాయడం చేస్తున్నాం. గుడ్డివారిగా పుట్టామన్న బాధను మరచిపోయేలా చదువుపై దృష్టి పెడుతున్నాం. బ్రెయిలీలా నేను కూడా బాగా చదువుకుని మంచి పేరు తెచ్చుకుంటాను.

– కొంతం సోనమ్మ, తొమ్మిదో తరగతి

మనో నేత్రమే ఆయుధం



వాంకిడి నుంచి వచ్చి మంచిర్యాలలో చదువుతున్నాను. అంధురాలిగా పుట్టాననే బాధ ఏమీ నాకు లేదు. మా పాఠశాలలో ఆ తేడానే రాకుండా మంచి బోధన అందిస్తున్నారు. తల్లిదండ్రులు దూరంగా ఉన్న బాధనే లేకుండా పోయింది. బాగా చదివి ఉన్నత ఉద్యోగం సాధించాలనే తపన నాలో ఉంది. మాకున్న మనోనేత్రం బ్రెయిలీలిపి, దీని సహకారంతో కష్టపడి బాగా చదువుతాను. మంచి ఉద్యోగం సాధిస్తాను. భవిష్యత్‌లో సమాజానికి సేవ చేయాలనుంది.

– పి. దీపిక, ఏడో తరగతి

ఎన్ని రోజులైనా అంధులకు సేవ చేస్తాం..




అంధులకు సేవ చేసేందుకు మేం ఎప్పుడూ సిద్ధమే. జిల్లాలోని నిరక్షరాస్యులైన అంధులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకోవడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం చేయూతను అందించకపోయినా, దాతలు అందిస్తున్న సహకారంతో మా పాఠశాల నడుస్తోంది. ప్రభుత్వం, దాతలు సహకరిస్తే ఎంతో మంది జీవితాల్లో అక్షర జ్యోతిని వెలిగించవచ్చు.

– అశోక్‌రావు, సాయి అంధుల పాఠశాల నిర్వాహకుడు




అంధ విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు


బ్రెయిలీ లిపిలో విద్యార్థులు రాసిన జవాబు పత్రం


బ్రెయిలీ లిపిని రాసేందుకు ఉపయోగించే పలక